ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



చిత్తూరు
జిల్లా వార్తలు

ఆదివారం 15 డిసెంబరు 2024

తిరుమలలో లావణ్య త్రిపాఠి

సినీ నటి లావణ్య త్రిపాఠి శనివారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయాధికారులు ఆమెకు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూ ప్రసాదాలు అందించారు. ఆలయం వెలుపల ఆమెను చూసేందుకు యాత్రికులు ఆసక్తి చూపారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి





స్వామి దర్శనార్థం ఆలయం వెలుపల క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు

వరసిద్ధుడి దర్శనానికి నాలుగు గంటలు

ఐరాల(కాణిపాకం), డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి దర్శనానికి శనివారం సుమారు నాలుగు గంటల సమయం పట్టింది. సామాన్య భక్తులతో పాటు అయ్యప్ప భక్తులు అధిక సంఖ్యలో విచ్చేయడంతో క్యూలైన్లు పూర్తిగా నిండి పోయాయి.క్యూలైన్లలో భక్తుల దాహార్తిని తీర్చడానికి ఆలయ సిబ్బంది తాగునీరు అందించారు.

టమోటా ధరల పతనం

పుంగనూరు, డిసెంబరు14(ఆంధ్రజ్యోతి):టమోటా ధరలు తగ్గుముఖం పట్టాయి. పుంగనూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం కిలో టమోటా రూ. 12 పలికింది. రైతులు వివిధ ప్రాంతాల నుంచి తీసుకొచ్చిన 45.91 మెట్రిక్ టన్నుల టమోటాలు నాణ్యతను బట్టి కిలో మొదటి రకం రూ. 12, రెండో రకం రూ. 11, మూడో రకం రూ. 10 చొప్పున వ్యాపారస్తులు కొనుగోలు చేశారు. సోమలలో శనివారం 15కిలోల బాక్సు రూ. 150పలికింది. రెండో రకం రూ. 100 లోపే పలకడంతో రైతుల్లో నిరుత్సాహం చోటు చేసుకుంది. ఇటీవల కురిసిన వర్షాలకు టమోటా తోటలు దెబ్బతిన్నాయి.దీనికితోడు చీడపీడలు వ్యాపించడంతో టమోటాల నాణ్యత దెబ్బతింది.దీంతో వాటిని మార్కెట్‌కు తరలించలేక పశువులకు మేతగా వేస్తున్నారు.

నీటి సంఘాలు టీడీపీ వశం

సాగునీటి సంఘాల ఎన్నికల్లో టీడీపీ ఏకపక్ష విజయం సాధించింది. ఓటమి భయంతో ఎన్నికలను వైసీపీ బహిష్కరించిన నేపథ్యంలో జిల్లాలోని 220 సంఘాల్లో 216 టీడీపీ మద్దతుదారులకే ఏకగ్రీవమయ్యాయి.సదుంలో మాత్రం మూడు సంఘాల్ని వైసీపీ దక్కించుకోగలిగింది. తవణంపల్లెలో ఓ సంఘానికి ఎన్నిక వాయిదా పడింది.

- 220సంఘాల్లో 216ఏకగ్రీవం
- సదుంలో మూడింటిని దక్కించుకున్న వైసీపీ
- ఎస్ఆర్‌పురంలో టీడీపీ వర్గీయుల మధ్యే వాగ్వాదం



కుప్పం మండలం దాసేగానూరు సాగునీటి సంఘం అధ్యక్ష కార్యదర్శులు, సభ్యులకు సత్కారం



ఎస్సార్‌పురంలో గెలిచిన సాగు నీటి సంఘ సభ్యులతో టీడీపీ నేతల విజయానందం

చిత్తూరు, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి):జిల్లావ్యాప్తంగా 31 మండలాల్లోని 215 చిన్న సాగునీటి వినియోగదారుల సంఘాలతో పాటు కార్వేటినగరంలోని కృష్ణాపురం ప్రాజెక్టుకు సంబంధించిన 5 సంఘాలకు శనివారం ఎన్నికలు జరిగాయి. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ ప్రక్రియ జరిగింది. 49,030 మంది ఓటు హక్కు కలిగిన రైతులుండగా.. ఎన్నికల నిర్వహణకు 2521 సిబ్బందిని నియమించారు. ప్రభుత్వ పాఠశాలల్లో 220 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా వైసీపీ ఈ ఎన్నికల్ని బహిష్కరించిన నేపథ్యంలో ఎక్కడా ఎన్నికలు జరగలేదు. తవణంపల్లెలో ఓ చోట మినహా అన్నిచోట్లా ఏకగ్రీవమయ్యాయి. తవణంపల్లె మండలంలోని తొడతర చెరువుకు మాత్రం ఎన్నిక వాయిదా పడింది. ఇక్కడి పోటీదారుడు నీటి తీరువా కట్టకపోవడంతో అనర్హుడిగా ప్రకటించి ఎన్నికను వాయిదా వేశారు. ఎస్ఆర్‌పురం మండలంలోని మూలూరు, ఆరుమాకుల కోన చెరువులకు ఎన్నిక సమయంలో టీడీపీ మండలాధ్యక్షుడు జయశంకర్‌నాయుడు వర్గీయులే బరిలో ఉన్నారని మాజీ అధ్యక్షుడు రుద్రప్ప నాయుడు వర్గీయులు వాగ్వాదానికి దిగారు. ఎమ్మెల్యే థామస్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన ఫోన్లో మాట్లాడి సర్దుబాటు చేశారు.

● పదవుల భర్తీతో టీడీపీలో జోష్..

సాగునీటి సంఘాల ఎన్నికల ఫలితాలతో టీడీపీ శ్రేణుల్లో జోష్ పెరిగింది. గ్రామీణ ప్రాంతాల్లో 216 ఛైర్మన్, 216 వైస్ ఛైర్మన్ పోస్టులను ఏకగ్రీవంగా దక్కించుకోవడంతో పార్టీ శ్రేణులు విజయానందంలో మునిగి తేలుతున్నాయి.కృష్ణాపురం ప్రాజెక్టులోని 5 సంఘాల్లో 60మంది సభ్యులున్నారు.శాంతిపురం మండలంలోని నాలుగు సంఘాలకు 31మంది సభ్యులున్నారు. ఇలా జిల్లాలోని మొత్తం 220 సంఘాలకు 1357 మంది సభ్యులుండగా.. తవణంపల్లెలో ఓ చోట మాత్రం ఎన్నికలు జరగకపోవడంతో ఆరుగురిని తీసేస్తే 1351మందిని శనివారం ఎన్నుకున్నారు.సదుం మండలంలోని మూడు సంఘాలు 18మంది వైసీపీ మద్దతుదారులకు దక్కడంతో మిగిలిన 1333మంది సభ్యులు టీడీపీ మద్దతుదారులే గెలిచారు.

సదుంలో సగం...సగం

సదుం, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సొంత మండలం సదుంలోని ఆరు చెరువుల సాగునీటి సంఘాల్లో మూడింటిని వైసీపీ దక్కించుకుంది. రాష్ట్రవ్యాప్తంగా వైసీపీ ఎన్నికల్ని బహిష్కరించినా, సదుంలో మాత్రం పోటీ పడ్డారు. **సదుం సీతమ్మ చెరువు, పాలమంద రెడ్డిచెరువు, తాటిగుంటపాళెం అగ్రహారం చెరువు నీటి సంఘాలను టీడీపీ మద్దతుదారులు కైవసం చేసుకున్నారు. చెరుకువారిపల్లెలో అయ్యావాని చెరువు నీటి సంఘాన్ని వైసీపీ మద్దతుదారులు చేజిక్కించుకున్నారు. వ్యాసప్ప చెరువు**కు ఎన్నికలు జరిగితే టీడీపీ, వైసీపీ మద్దతుదారులు చెరి మూడు గెలిచారు.అధికారులు టాస్ వేసి వైసీపీ గెలిచినట్లు ప్రకటించారు.**చిక్కరాయ చెరువు** నీటిసంఘంలోని ఆరుగురు సభ్యుల్లో ఐదుగురు వైసీపీ మద్దతుదారులు ఏకగ్రీవమవగా.. ఎన్నిక జరిగిన మరో స్థానంలోనూ వైసీపీ మద్దతుదారు గెలిచాడు.

నేటితో ఆధార్ అనుసంధానం పూర్తిచేయాలి

చిత్తూరు కలెక్టరేట్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆధార్ అనుసంధాన ప్రక్రియను ఆదివారంలోగా పూర్తి చేయాలని సచివాలయ సిబ్బందిని జీఎస్‌డబ్ల్యూఎస్ విభాగ జిల్లా అధికారి రవికుమార్ ఆదేశించారు.లబ్ధిదారుల ఖాతాలకే నేరుగా రాయితీ సొమ్మును జమ చేసే విషయంలో జాతీయ చెల్లింపుల సంస్థ నిబంధనల మేరకు ఆధార్ అనుసంధానం చాలాచోట్ల జరుగలేదు. ఈ అప్డేషన్ ప్రక్రియను నెలరోజులుగా గ్రామ, వార్డు సచివాలయాల్లో సిబ్బంది చేపట్టారు. జిల్లాలో 2,14,050 ఖాతాలకు ఆధార్ సంఖ్య అనుసంధానం కాలేదని నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) గుర్తించింది. వీటి అప్డేషన్‌కు ప్రభుత్వం గతనెల 4వ తేదీ నుంచి గడువు ఇచ్చింది. ఆ తర్వాత విడతలవారీగా గడువును పెంచుకుంటూ వెళ్ళింది.ఇటీవల జరిగిన కలెక్టర్ల సదస్సులో ఆదివారం లోగా ఈ ప్రక్రియను పూర్తిచేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. తాజా సమాచారం మేరకు 31 మండలాలు, ఐదు మున్సిపాలిటీల పరిధిలో చిత్తూరుజిల్లా 99.80 శాతం మేరకు అప్డేషన్ చేసింది. మొత్తం 2,14,050 ఖాతాలకు ఆధార్ అనుసంధానం 2,13,670 పూర్తి కాగా, 19,392 మంది మృతిచెందినట్లు గుర్తించారు. ప్రస్తుతం 380 ఖాతాలు మాత్రమే అప్డేషన్ జరగాల్సి ఉంది. మండలాల వారీగా పుంగనూరు, పెనుమూరు, రొంపిచెర్ల, శ్రీరంగరాజపురం మండలాలు వంద శాతం పూర్తిచేయగా, మిగిలిన 27 మండలాలు, ఐదు మున్సిపాలిటీల్లో 1 నుంచి 99 ఖాతాల అప్డేషన్‌ను ఆదివారంలోగా పూర్తిచేయాల్సివుంది. అత్యధికంగా చిత్తూరు మున్సిపాలిటీలో 99, బైరెడ్డిపల్లిలో 59, పులిచెర్లలో 51, గుడుపల్లిలో 31 కార్డులు పెండింగ్‌లో ఉన్నాయి.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

● జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఇ.భీమారావు

చిత్తూరు లీగల్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మూడు నెలలకోసారి జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఇ.భీమారావు కోరారు. చిత్తూరు జిల్లా కోర్టుల ఆవరణంలో శనివారం జరిగిన లోక్ అదాలత్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు కోర్టుల చుట్టూ తిరిగి జీవితాలను నాశనం చేసుకోకూడదని సూచించారు. లోక్ అదాలత్‌ను విజయవంతం చేసేందుకు పోలీసులు, న్యాయవాదులు కృషిచేయాలన్నారు. కక్షిదారులకు చట్టాలపై అవగాహన కల్పిస్తూ పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. లోక్‌అదాలత్ ద్వారా క్రిమినల్ కేసులతో పాటు సివిల్, బ్యాంకులు, చిట్‌ఫండ్స్ వంటి పలురకాల కేసులను కూడా పరిష్కరించుకునే అవకాశం ఉందన్నారు. కక్షిదారులకు బీమాకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను అందజేశారు.డీఎల్ఎస్ఏ సెక్రటరీ భారతి, న్యాయమూర్తులు శ్రీదేవి, మాధవి, శ్రీనివాసులు, పద్మజ, విమల, న్యాయవాదుల సంఘం అధ్యక్షులు రాజేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

5317 కేసుల పరిష్కారం

ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని న్యాయస్థానాల్లో శనివారం జరిగిన లోక్ అదాలత్‌లో మొత్తం 5317కేసులు పరిష్కారమయ్యాయి.తిరుపతిలో 2029,చిత్తూరులో 901,మదనపల్లెలో 306,పలమనేరులో 130, కుప్పంలో 120, పుంగనూరులో 133,నగరిలో 188,పాకాలలో 108, శ్రీకాళహస్తిలో 337, సత్యవేడులో 311,వాయల్పాడులో 144, తంబళ్లపల్లెలో 115,పీలేరులో 121 కేసులు పరిష్కారమయ్యాయి.పుత్తూరు కోర్టులో మొత్తం 514 కేసులు పరిష్కారం కాగా, రూ.2.02 కోట్లతో సెటిల్‌మెంట్ జరిగింది. ఇందులో 33 సివిల్ కేసులు, 470 క్రిమినల్ కేసులు, 11 ప్రీ లిటిగేషన్ కేసులు పరిష్కారమయ్యాయి.



కక్షిదారులకు ధ్రువీకరణపత్రం అందిస్తున్న జిల్లా జడ్జి ఇ.భీమారావు

ప్రకృతి సోయగాల నెలవును పట్టించుకోరూ!

ఆకట్టుకునే చెలిమిచేను జలపాత అందాలు

అభివృద్ధి చేయాలంటున్న ప్రకృతి ప్రేమికులు



జలపాతం వద్ద పరుచుకున్న పచ్చదనం



చెలిమిచేను సమీపంలోని జలపాతం(ఫైల్ ఫొటో)

రామకుప్పం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి):రామకుప్పం మండలం చెలిమిచేను గ్రామ సమీపంలోని జలపాతం ఏటా వర్షాకాలంలో జలసోయగాలు పోతుంది. పక్షుల కిలకిలరావాలు.... కనుచూపు మేర నలుదిక్కులా పరచుకున్న పచ్చదనం, అల్లంత ఎత్తు నుంచి జాలువారే జలాలు ప్రకృతి ప్రేమికులను అట్టే కట్టిపడేస్తాయి.గోవిందపల్లె-వీర్నమల రహదారి నుంచి సుమారు కిలోమీటరు దూరంలో కౌండిన్య అభయారణ్య సరిహద్దుల్లో ఉన్న ఈ జలపాతంలో సుమారు 200అడుగుల ఎత్తు నుంచి జలాలు కిందకు జాలువారే దృశ్యాలు వీక్షకులకు ఎంతో మానసికోల్లాసాన్ని కల్గిస్తాయి. జలపాతం పైభాగంలో చెక్‌డ్యాం నుంచి బండలను చీల్చుకుంటూ వచ్చే జలాలు చూపరులను ఇట్టే ఆకర్షిస్తాయి.అక్కడకు వచ్చిన వారంతా వయోబేధం లేకుండా బండలపై జాలువారుతున్న జలాల్లో ఆడకుండా వెనుదిరగరు. అక్కడి కొండలను పరచుకున్న పచ్చదనం అదనపు ఆకర్షణగా నిలుస్తుంది.అడపాదడపా ఎత్తైన వృక్షసంపద మధ్య నెమళ్ళు, జింకలు తిరుగాడుతూ వీక్షకులకు నేత్రానందాన్ని కల్గిస్తాయి.



జలపాతం వద్దకు వెళ్ళే రహదారి రాళ్ళమయం

మాటలకే పరిమితమైన అభివృద్ధి

చెలిమిచేను జలపాతాన్ని అభివృద్ధి చేస్తామన్న అటవీశాఖ హామీలు మాటలకే పరిమితమయ్యాయి. ఈ జలసోయగాలను తిలకించేందుకు కుప్పం, పలమనేరు నియోజకవర్గాల నుంచే కాకుండా కర్ణాటక, తమిళనాడు నుంచి రోజూ వందల సంఖ్యలో పర్యాటకులు వస్తుంటారు. అలరించే ప్రకృతి అందాలున్న ఈ ప్రాంతంలో ఎటువంటి రక్షణ చర్యలు లేకపోవడం ప్రమాదకరంగా మారింది. జలపాతం పైభాగంలో నీళ్ళలో జలకాలాడే సందర్భంలో జలప్రవాహ ఉధ్రుతి ఎక్కువై పలువురు కిందకు జారిపోయి మృత్యువాత పడ్డారు. అంతేకాకుండా ఎత్తైన ప్రదేశం నుంచి కిందకు జాలువారే జలహోరును తిలకించాలంటే జలపాతం పైభాగం నుంచి సుమారు అరకిలోమీటరు అడవిలో నడిచి వెళ్ళాలి. అక్కడ కూడా ఎటువంటి రక్షణ చర్యలు లేవు. అదేవిధంగా గోవిందపల్లె-వీర్నమల రహదారి నుంచి జలపాతం వద్దకు వెళ్ళే రహదారి రాళ్లురప్పలు, గుంతలమయమై రాకపోకలకు ఇబ్బందికరంగా వుంది. చెలిమిచేను జలపాలాన్ని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తామని దశాబ్దాలుగా అటవీశాఖ అధికారులు ఇక్కడకు వచ్చిన ప్రతిసారి హామీలిస్తున్నారే తప్ప, ఆ దిశలో ఒక్క అడుగు కూడా పడలేదు. జలపాతం నుంచి జాలువారే జలాలు పడేవిధంగా జలపాతం దిగువన పెద్దశివలింగం ఏర్పాటు చేస్తామని, జలపాతం పైభాగంలో రక్షణగా కంచెలు ఏర్పాటు చేస్తామని హామీలిచ్చారు.

డ్యాం నిర్మిస్తే భూగర్భజలాల వృద్ధి

ప్రస్తుతం జలపాతం నుంచి జాలువారే జలాలు అటవీప్రాంతం గుండా తమిళనాడు రాష్ట్రంలోని పాలారు నదికి వెళ్ళిపోతున్నాయి. ఆ రెండు కొండల నడుమ డ్యాం నిర్మించాలని ఇక్కడి రైతులు కోరుతున్నారు. ఇక్కడ డ్యాం నిర్మిస్తే వీర్నమల, వీర్నమల పెద్దతండా, గుట్టూరుతండా, 89పెద్దూరు, బల్ల, కెంచనబల్ల పంచాయతీల పరిధిలో భూగర్భజలాలు వృద్ధి చెందుతాయని ఆశపడుతున్నారు.

శ్రీవారి సేవలో సుబుదేంద్రతీర్థ

తిరుమల, డిసెంబరు14(ఆంధ్రజ్యోతి):కర్నూలు జిల్లాలోని మంత్రాలయం రాఘవేంద్ర మఠాధిపతి సుబుదేంద్రతీర్థ స్వామి శనివారం తిరుమల శ్రీవారిని పెద్దమర్యాదతో దర్శించుకున్నారు. ఉదయం నైవేద్య విరామ సమయంలో ఆలయం ముందున్న అఖిలాండం వద్దకు తన శిష్యబృందంతో కలిసి సుబుదేంద్రతీర్థ స్వామి చేరుకోగా అర్చక బృందం, టీటీడీ ఈవో శ్యామలరావు శఠారీని సమర్పించి ఇస్తికాఫల్ స్వాగతం పలికారు.అనంతరం మహద్వారం నుంచి ఆలయంలోకి వెళ్లిన సుబుదేంద్రతీర్థ స్వామి ధ్వజస్తంభాన్ని తాకుతూ గర్భాలయానికి చేరుకుని మూలవిరాట్టును దర్శించుకున్నారు.















తెలిమంచు కరిగింది.. తలుపు తీయనా ప్రభూ!

మంచు మబ్బుల గూటిలో ఎర్రనయ్య ఒదిగి కూర్చుంటాడు. రెక్కలు విప్పని పిట్ట ఎండ సెగ కోసం ఎదురు చూస్తుంది. తెల్లవారినా దృశ్యం మసకబారే కనిపిస్తుంది. ఎండ చురుకు తగలదు. పువ్వూ ఆకూ చెట్టూ సమస్తమూ తడికి ముడుచుకుంటాయి. రాత్రి కురిసిన మంచు ముత్యాలు సాలెగూటిమీద వాలి తళుకుమంటాయి. ఉండి ఉండీ ఒక జల్లు చినుకులు చిలకరిస్తుంది. చెట్టునుంచి రాలిన పూలు బాటను పరిమళభరితం చేస్తాయి. పచ్చని ఒడిలోంచి గోపురం తొంగి చూస్తుంది. సూర్యభగవానుడికి చేతులు జోడించి గరుడుడు వెచ్చదనాన్ని వేడుకుంటాడు. ఎటు చూసినా మంచు తెరల మనోహర సౌందర్యం కనువిందు చేస్తుంది. తిరుపతి పరిసరాల్లోని ఈ మంచు అందాలను కెమెరాలోకెక్కించి అందిస్తున్నారు ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్.





31 కంపార్ట్‌మెంట్లలో భక్తులు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 16 గంటల సమయం పడుతోంది. శనివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్‌2లో 31 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులూ, నారాయణగిరిలో 4 షెడ్లలో సర్వదర్శన భక్తులు.. వైకుంఠం క్యూకాంప్లెక్స్‌1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

శుక్రవారం నాటి హుండీ ఆదాయం: రూ.3.77 కోట్లు

శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 63,722

తలనీలాలు సమర్పించినవారు : 22,225







SUNDAY SPECIAL

జయహో... సిద్ధవరం

నేలను తాకుతూవుండే పూరిగుడిసెలు.. ఒంటిమీద గోచి, చెరువుల్లో చేపల వేట, పొలాల్లో ఎలుకలు పట్టడం, మామిడి తోటల్లో కాపలా ఉండడం.. కార్యాల పేరుతో తాగడం.. ఒళ్లు తెలియకుండా డుబ్బుంకు వాయిస్తూ ఆడడం.. మాట మాటకూ తుళ్లిపడి నవ్వడం.. యానాదిపాళెం అనగానే గుర్తొచ్చే దృశ్యాలు ఇవి. మహా సిగ్గరులైన వీరు మైదాన ప్రాంత జనాలతో పెద్దగా కలవరు. మంచితనం, అమాయకత్వం మూర్తీభవించిన గిరిజనం వీరు. తరాలు గడిచినా వీరి జీవన విధానంలో స్వల్ప మార్పులే వచ్చాయి. వీరి జీవితానికి అద్దంపట్టే కథలు కరుణకుమార రాశారు. వీరి అభ్యున్నతి కోసం వెన్నెలకంటి రాఘవయ్య కలలు కన్నారు. కృషి చేశారు. ఆయన గతించిపోయినా.. ఆయన కన్న కలలు ఇప్పుడు నిజం అవుతున్నాయనేందుకు సాక్ష్యం కోట మండలంలోని సిద్ధవరం ఎస్టీకాలనీ. మిద్దెలు.. పేడ కళ్లాపి చల్లి ముగ్గులు దిద్దిన వాకిళ్లు.. అరటి, చింత చెట్లున్న పెరళ్లు.. విరబూసిన పూలమొక్కలు.. చదువుల లోగిలిగా మారిన ఆ పల్లె.. వెనుకబాటుతనంపై విజయం సాధించి.. అందరికీ ఆదర్శంగా నిలుస్తోంది.

వెన్నెలకంటి కలలు నిజం చేసిన గిరిజనపాళెం
వేటను వదిలి ఉద్యోగాల బాట
ప్రభుత్వ బడుల చదువులతోనే సాధించిన పల్లె

కథనం

కోట, ఆంధ్రజ్యోతి

ఆ పల్లెపేరు సిద్ధవరం. తిరుపతి జిల్లా కోట మండలంలో ఉన్న పల్లె అది. అన్ని ఊళ్లలో లాగే ఆ ఊరి చివరా 70 కుటుంబాల గిరిజన కాలనీ ఉంది. చెరువుల్లో, బకింగ్‌హామ్ కెనాల్‌లో చేపలు పట్టుకుని అమ్ముకోవడం వాళ్ల జీవనాధారం. తరాలుగా సాగుతున్న ఈ సంప్రదాయానికి సిద్ధవరం గిరిజన కాలనీ స్వస్తి చెప్పింది. ఒకరొకరుగా చదువుకోవడం మొదలుపెట్టారు. సాధారణంగా టెన్త్ లోపలే వీరు బడికి బై చెప్పేస్తారు. చేపల వేట, పొలాల్లో కూలి పనులు, ఆటలు, సినిమాలు.. వీటితోనే జీవితం గడిపేసే వీరు కాలేజీ మెట్లెక్కుతున్నారు. అవకాశాలను అందుకుంటున్నారు. దీంతో ఈ చిన్న కాలనీలో 20 మంది ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తున్నారు. ఈ కాలనీకి చెందిన తుపాకుల అశోక్, రాజమండ్రిలోని నన్నయ్య యూనివర్సిటీ కాలేజీ ప్రిన్సిపాల్‌గా ఉన్నారు. ముగ్గురు ప్రభుత్వ ఉపాధ్యాయులుగా పిల్లలకు చదువులు చెబుతున్నారు. ఒక అంగన్‌వాడీ టీచర్ ఉన్నారు. ఒకరు ఏఎన్ఎంగా, ఒకరు ఆర్టీసీ కండెక్టర్‌గా, నలుగురు సచివాలయ ఉద్యోగులుగా పనిచేస్తున్నారు. ఒక ఐసీడీఎస్ సూపర్ వైజర్, ఇద్దరు ఆఫీసు సబార్డినేట్‌లు, ఒక మహిళా కానిస్టేబుల్, ఒక రికార్డు అసిస్టెంట్, ఒక జూనియర్ అసిస్టెంట్, ఒక జూనియర్ ఆడిటర్‌గా కూడా ఈ గిరిజన కాలనీ బిడ్డలు కుదురుకున్నారు. సిద్ధవరం గిరిజనకాలనీ నుంచి ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లున్నారు. నలుగురు పోస్టుగ్రాడ్యుయేషన్ చేశారు. ఆరుగురు డిగ్రీ పాస య్యారు. విశేషం ఏమిటంటే.. వీరంతా ప్రభుత్వ బడులు, కాలేజీల్లోనే చదువుకుని ఉద్యోగాలు సాధించినవారు కావడం.

చదువుకున్న తర్వాత సమాజంలో తమకు లభిస్తున్న గౌరవం, ఆదరణ చూసి గిరిజన కాలనీలోని అన్ని కుటుంబాలవారూ సంప్రదాయ పనులకు స్వస్తి చెప్పి బడిబాట పడుతున్నారు. తమ పిల్లలను బడికి పంపుతున్నారు. చదువుకుని వివిధ కొలువుల్లో ఉన్న ఈ కాలనీవాసులు మిగిలిన వారిని కూడా చదువుల దిశగా ప్రోత్సహిస్తున్నారు. వారికి అండాదండా అందిస్తున్నారు.

చదువులే మా బతుకులు మార్చాయి

మా మాదిరిగా బిడ్డలు ఉండకూడదనుకున్నాం. కూలినాలి చేసుకుంటూనే బడికి పంపాం. చదువుకున్నారు. ఒకరు టీచరయ్యారు. ఇంకొకరికి గవర్నమెంటు నౌకరీలో కుదురుకున్నారు. ఒకప్పుడు పిడికెడు మెతుకులకోసం చెరువుల వెంటా, కయ్యల వెంటా తిరుగులాడిన మేము, మా బిడ్డల చదువుల పుణ్యం వల్ల నలుగురికి పెట్టగలుగుతున్నాం.



- కాటి శాంతమ్మ, సిద్ధవరం

అమ్మ పెట్టిన చదువు భిక్ష ఇది

అమ్మానాన్నల కష్టాన్ని చూస్తూ పెరిగాను. కష్టపడి చదివాను. మంచి మార్కులే సాధించా. నాలాగా ఎందరినో తయారు చేయగల ఉద్యోగం వచ్చింది. సమాజంలో నాకు గౌరవ మర్యాదలు దక్కింది నా చదువు వల్లనే. నా మూలాలు ఎన్నటికీ మరవలేదు. మావాళ్లను చదువువైపు ప్రోత్సహిస్తున్నా.

- తుపాకుల అశోక్, ప్రిన్సిపాల్, ఆదికవి నన్నయ్య యూనివర్శిటీ



"ఇప్పటికీ ఆహార సేకరణ దశలోనే ఎక్కువగా ఆధారపడిన గిరిజన జాతి జనం వారు. ఉమ్మడి నెల్లూరు, చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల్లో అడవి అంచు పల్లెల్లోనే వీరి ఆవాసం. సముద్రతీర ప్రాంతాల్లో చేపల వేట వీరి ప్రధాన వృత్తి. చేపల వేటకు వీరు చెరువులు, గుంటలు, పులికాట్ సరస్సుకే పరిమితం అవుతారు. మత్స్యకారుల్లా సముద్రం మీదకు వెళ్లరు. పట్టణ జీవితాన్ని ఇష్టపడరు. ప్రకృతికి దగ్గరగానే జీవిస్తారు. చదువు ఆలోచన ఉండదు. ఉద్యోగాల కోసం ప్రయత్నించరు. ఎస్టీ జాబితాలో ఉన్నా తమ కోసం ఉన్న పథకాల గురించిన అవగాహన కూడా లేని ఈ గిరిజన కాలనీలు తరాలుగా ఇప్పటికీ ఇలాగే ఉన్నాయి. ఈ మంకు సంప్రదాయాన్ని బద్దలు కొట్టింది సిద్ధవరం ఎస్టీ కాలనీ "

ఫోర్జరీ సంతకంతో రూ.88 వేలు డ్రా

- జూపార్కు అవుట్ సోర్సింగ్ ఉద్యోగిపై కేసు నమోదు

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఫోర్జరీ సంతకంతో డబ్బు డ్రా చేసిన తిరుపతి ఎస్వీ జూపార్కు అవుట్ సోర్సింగ్ ఉద్యోగిపై తిరుపతి రూరల్ పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. రూరల్ సీఐ చిన్నగోవిందు వివరాల మేరకు.. జూ పార్కులోని క్యాంటీన్లలో ఈ ఏడాది ఏప్రిల్, మే నెలల్లో కాంట్రాక్టర్ హరినాథ్ ద్వారా ఎలక్ట్రిక్ పనులు చేయించారు. అప్పట్లో అసిస్టెంట్ క్యూరేటర్‌గా ఉన్న మాధవి ఆధ్వర్యంలో ఈ పనులు చేపట్టారు. ఆ తర్వాత ఆమె బదిలీపై వెళ్లిపోయారు. దీన్ని అవకాశంగా చేసుకున్న అవుట్ సోర్సింగ్ ఫీల్డ్ ఇంజనీరు రవితేజ ఆమె సంతకాన్ని ఫోర్జరీ చేసి, రూ.88,317ను కాంట్రాక్టర్ హరినాథ్‌కు మంజూరు చేయించాడు. ప్రస్తుత అసిస్టెంట్ క్యూరేటర్ జగదీష్ చంద్రప్రసాద్‌కు అనుమానం రావడంతో విచారణ చేపట్టారు. సంతకం ఫోర్జరీ చేసినట్లు నిర్ధారించి ఉన్నత స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లి రవితేజను విధుల నుంచి తప్పించారు. ఫారెస్టు అసిస్టెంట్ కన్జర్వేటర్ నాగభూషణం ఫిర్యాదు మేరకు రవితేజపై ఐపీసీ సెక్షన్ 406, 465(ఫోర్జరీ) మరియు 471 కింద రూరల్ ఎస్ఐ రామకృష్ణ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీకాళహస్తిలో వైసీపీ హైడ్రామా

అధికారులపై రెచ్చిపోయిన మాజీ ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి





ఎక్సకవేటర్‌కు అడ్డుగా కూర్చున్న చెంచురెడ్డి - దుర్భాషలాడుతున్న మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తిలో శనివారం వైసీపీ హైడ్రామా సృష్టించింది. మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అధికారులపై బూతుపురాణంతో చెలరేగిపోయారు. ముక్కంటి ఆలయ సమీపంలోని స్వర్ణముఖి నది కరకట్టకు ఆనుకుని మాజీ ఎమ్మెల్యే చెంచురెడ్డి అల్లుడు శేఖర్‌రెడ్డికి కొంత స్థలం ఉంది. కొన్ని సంవత్సరాల క్రితం ఆయన రివర్‌వ్యూ రిసార్ట్ పేరుతో అక్కడ ప్రైవేటు అతిథిగృహాన్ని నిర్మించుకున్నారు. స్వర్ణముఖి నది కరకట్టను రిసార్ట్‌కు రహదారిగా కొనసాగిస్తున్నారు. మూడేళ్ల క్రితం స్వర్ణముఖి నది కరకట్ట సుందరీకరణ పేరుతో రిసార్ట్ వద్ద మాజీ ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి ఫ్లడ్‌వాల్, దానిపై విస్తారమైన కరకట్ట చేపట్టారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు రానున్న సందర్భంగా పడమర వైపు కరకట్ట నుంచి వాహనాలు మళ్లించడంతో పాటు కరకట్టకు ఆనుకుని బఫర్‌జోన్‌లో ఉన్న నిర్మాణాలను తొలగించాలని అధికారులు ప్రతిపాదించారు. రివర్ వ్యూ రిసార్ట్ ప్రహరీ కొంతభాగం స్వాగత ఆర్చీ కరకట్టకు ఆనుకుని ఉన్నాయి. వీటిని కూల్చివేసేందుకు ఆర్డీవో భానుప్రకాశ్‌రెడ్డి, మున్సిపల్ అధికారులు, పోలీసులు ఎక్స్‌కవేటర్‌తో అక్కడికి చేరుకున్నారు. విషయం తెలుసుకున్న మధుసూదన్‌రెడ్డి వైసీపీ నాయకులతో అక్కడికి చేరుకుని అధికారులపై బూతు పదజాలంతో నిప్పులు చెరిగాడు. ఎక్సకవేటర్ ముందు ఉన్న బకెట్‌పై భైఠాయించి తాను ఇక్కడే చచ్చిపోతానంటూ డ్రామాకు తెరతీశాడు. పత్రికల్లో రాయలేని భాషతో విరుచుకుపడ్డారు. ఆ వీడియో వైరల్ కావడంతో కాసేపటికి రిసార్ట్ లోపల గదిలోకి వెళ్లిపోయారు. మాజీ ఎమ్మెల్యే చెంచురెడ్డి కుటుంబ సభ్యులతో అడ్డంగా భైఠాయించారు. నోటీసు, ముందస్తు సమాచారం ఇవ్వకుండా ఇలా కక్షసాధింపు చర్యలకు ఎందుకు పాల్పడుతున్నారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం, తిరుపతి మాజీ ఎమ్మెల్యే కరుణాకరరెడ్డి, ముక్కంటి ఆలయ పాలకమండలి మాజీ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, వైసీపీ శ్రేణులు పెద్దఎత్తున అక్కడికి చేరుకున్నారు. కరకట్టకు ఇరువైపులా ఎన్నో భారీ నిర్మాణాలు ఉన్నా వాటిని ఎందుకు తొలగించడంలేదని ప్రశ్నించారు. సుమారు 4గంటల పాటు అధికారులు, వైసీపీ నేతల మధ్య వాగ్వాదం జరిగింది. ఆర్డీవో రవిశంకర్‌రెడ్డి మాట్లాడుతూ కరకట్టకు ఆనుకుని మరీ ముందు భాగానికి చొరబడ్డ స్వల్ప నిర్మాణాన్ని మాత్రమే తాము తొలగించబోతున్నామని, ఇలా అధికారులను దుర్భాషలాడటం, విధులకు ఆటంకం కలిగించడం సబబు కాదని అన్నారు. అసలు ఈ స్థలానికి ల్యాండ్ కన్వర్షన్ కాలేదని, భవన నిర్మాణానికి కనీస అనుమతులు కూడా తీసుకోలేదన్నారు. రెండు వారాలు గడువు ఇస్తే తామే తొలగిస్తామని భవన యజమాని విజ్ఞప్తి చేశారు. అందుకు ఆర్డీవో ససేమిరా అన్నారు. భోజన విరామం తర్వాత అధికారులు మళ్లీ యంత్రంతో అక్కడికి చేరుకుని ఆర్చీని కూల్చివేశారు. గడువు అడిగినప్పటికీ అధికారులు దౌర్జన్యంగా కూల్చివేశారంటూ భవన యజమాని ఆవేదన వ్యక్తం చేశారు.

రేణిగుంట రైల్వే స్టేషన్‌కు ఇంధన పరిరక్షణ అవార్డు



అవార్డును అందుకుంటున్న డీఆర్ఎం విజయ కుమార్

తిరుపతి(ఆటోనగర్), డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): గుంతకల్లు రైల్వే డివిజన్‌కు రెండు జాతీయ ఇంధన పరిరక్షణ పురస్కారాలు లభించాయి. భారత ప్రభుత్వ విద్యుత్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జాతీయ ఇంధన పరిరక్షణ అవార్డుల ప్రదాన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. గుంతకల్లు రైల్వే ఆసుపత్రికి, రేణిగుంట రైల్వే స్టేషన్‌కు ఇంధన పరిరక్షణలో ప్రథమ బహుమతి లభించింది. ఢిల్లీలో నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవంలో ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌కర్ నుంచి డివిజన్ అవార్డులను డీఆర్ఎం విజయకుమార్ స్వీకరించారు. గుంతకల్లు రైల్వే ఆసుపత్రిలో గ్రిడ్, జనరేటర్ల ద్వారా ఉత్పత్తి చేసిన విద్యుత్తు కారణంగా 2021-22లో 2.27 లక్షల యూనిట్ల కొనుగోలు విద్యుత్ వినియోగాన్ని 2022-23 సంవత్సరంలో 1.85 లక్షల యూనిట్లకు, 2024-25 నాటికి 0.96 లక్షల యూనిట్లకు తగ్గించారు. రేణిగుంట రైల్వే స్టేషన్‌లో ఇలాగే 7.17 లక్షల యూనిట్ల వినియోగం నుంచి 2.73 లక్షల యూనిట్లకు కొనుగోలు విద్యుత్ వినియోగాన్ని తగ్గించారు. ఈ కారణంగా డివిజన్‌కు జాతీయ ఇంధన పరిరక్షణ అవార్డులు లభించాయి.

వినియోగదారులకు సత్వర సేవలందించాలి

తిరుపతి(సెంట్రల్)డిసెంబరు14(ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులకు సత్వర సేవలందించాలని ఏపీఈఆర్‌సీ చైర్మన్ ఠాకూర్ రామసింగ్ అధికారులను ఆదేశించారు. తిరుపతి పర్యటలో భాగంగా శనివారం అధికారులతో సమీక్ష చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులకు అసౌకర్యం కలిగినట్లు ఫిర్యాదులు వస్తే జరిమానా తప్పదని హెచ్చరించారు. ట్రాన్స్‌ఫార్మర్లు, మీటర్లు విఫలమైతే వెంటనే మార్చాలని ఆదేశించారు. అవసరమైన ప్రాంతాల్లో నూతన విద్యుత్ సబ్ స్టేషన్లు నిర్మించాలన్నారు. ఇందుకోసం స్థలాలు సేకరించాలన్నారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లను వెంటనే మంజూరు చేయాలని సూచించారు. అవసరమైన విద్యుత్ వైర్లను నిబంధనల మేరకు కొనుగోలు చేయాలన్నారు. విద్యుత్ బకాయిలు వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రస్తుతం నిర్మిస్తున్న సబ్‌స్టేషన్ల నిర్మాణాలను త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు. ఈ సమీక్షలో జీఎం వరకుమార్, ఎస్ఈలు పి.సురేంద్రనాయుడు, ఇస్మాయిల్, ఓఎస్‌డి మునిశంకరయ్య, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ శ్రీనివాసులు, ఈఈలు వాసవీలత, పి.రవికుమార్, పి.బాలాజీ వి.చంద్రశేఖర్ రావు, వాసురెడ్డి, డీఈఈలు భాస్కర్‌నాయుడు, జయప్రకాష్, ఏఈలు శ్రీనివవాసులు, గణపతి, ట్రాన్స్‌కో అధికారులు పాల్గొన్నారు.

28న డయల్ యువర్ టీటీడీ ఈవో

తిరుమల, డిసెంబరు14(ఆంధ్రజ్యోతి): టీటీడీ డయల్ యువర్ ఈవో కార్యక్రమం ఈ నెల 28న ఉంటుంది. తిరుమల అన్నమయ్య భవనంలో ఉదయం 9 నుంచి 10 గంటల మధ్య ఈకార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. భక్తులు తమ సందేహాలు, సూచనలు, ఫిర్యాదుల గురించి టీటీడీ ఈవో శ్యామలరావుతో నేరుగా ఫోన్‌లో మాట్లాడవచ్చు. భక్తులు ఫోన్ చేయాల్సిన నెంబర్: 0877 2263261

ఫోర్జరీ కేసులో హైకోర్టు న్యాయవాది అరెస్టు



శ్రీనివాస్

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): బ్యాంకుకు ఫోర్జరీ డాక్యుమెంటు సమర్పించిన కేసులో హైకోర్టు న్యాయవాది తోట శ్రీనివాస్‌ను శనివారం తిరుపతి క్రైం పోలీసులు అరెస్టు చేశారు. క్రైం డీఎస్పీ రమణకుమార్ వివరాల మేరకు.. రేణిగుంట మండలం కరకంబాడీ వద్ద ఇళ్లు శుభ్రం చేసే మాప్‌లు తయారు చేసే ఫ్యాక్టరీ పెట్టడానికి ఐదుగురు బాలాజీ కాలనీలోని ఎస్‌బీఐ బ్యాంకుకు రుణం కోసం దరఖాస్తు చేశారు. అన్ని పత్రాలు పరిశీలించిన బ్యాంకు అధికారులు రూ.2.80 కోట్లు రుణం మంజూరు చేశారు. ఇందులో అవకతవకలు జరిగినట్లు గుర్తించిన బ్యాంకు ఉన్నతాధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన పోలీసులు రెండు నెలల క్రితం నలుగురు నిందితులను అరెస్టు చేసి, రిమాండ్‌కు పంపారు. ఈ వ్యవహారంలో చిలకలూరిపేట పురుషోత్తపట్నంలో కాపురముంటున్న హైకోర్టు న్యాయవాది, రాష్ట్ర కాపునాడు సేవాసమితి జాతీయ ప్రధాన కార్యదర్శి తోట శ్రీనివాస్ ఫోర్జరీ డాక్యుమెంట్లు సృష్టించినట్లు గుర్తించి అక్కడ అరెస్టు చేసి, తిరుపతికి తీసుకొచ్చారు. రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ రమణకుమార్ చెప్పారు.

రేణిగుంట రైల్వే స్టేషన్‌లో అన్యమత ప్రచారం



తిరుపతి(సెంట్రల్)డిసెంబరు14(ఆంధ్రజ్యోతి): రేణిగుంట రైల్వే స్టేషన్‌లో ప్రధాన మైన ప్రదేశాల్లో గుర్తు తెలియని వ్యక్తులు శిలువ బొమ్మలు వేసి అన్యమత ప్రచారం చేశారు. రైల్వే స్టేషన్‌లో అధికారుల అనుమతులు లేకుండా ఎవరూ ప్రచారం చేయకూడదన్న నిబంధనలు వున్నాయి. రెండు రోజులుగా స్టేషన్‌లో ఉన్న నోటీస్ బోర్డు, ఇతర ప్రదేశాల్లో శిలువ బొమ్మలు గీసి సంఖ్యలు వేసి ప్రచారం చేశారు.



చాపలను వితరణ చేస్తున్న దాత - స్వామి సేవలో పాల్గొన్న విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తి

సంకటహర గణపతి వ్రత నిర్వహణ కోసం చాపల వితరణ

ఐరాల(కాణిపాకం),డిసెంబరు14(ఆంధ్రజ్యోతి):కాణిపాక క్షేత్రంలో సంకటహర గణపతి వ్రత నిర్వహణ కోసం శనివారం ముళబాగల్‌కు చెందిన రమేష్ ఆలయానికి 300చాపలను వితరణ చేశారు. దాతను ఈఈ వెంకటనారాయణ, ఏఈవో రవీంద్రబాబు స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్శనానంతరం స్వామి శేషవస్త్రాలు,తీర్థప్రసాదాలు,జ్ఞాపికనుఅందించారు.

వరసిద్ధుడి సేవలో విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తి

కాణిపాక వరసిద్ధుడిని విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తి భవానీప్రసాద్ దర్శించుకున్నారు. ఆయన్ను సూపరింటెండెంట్ వాసు ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్శనానంతరం స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు.

రూ.30 కోట్ల అవినీతికి పాల్పడ్డ మాజీ కమిషనర్

● వైసీపీ నేతల ప్రోద్బలంతోనే నిధులు స్వాహా చేసిన అరుణ : టీడీపీ


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సప్తగిరి ప్రసాద్

చిత్తూరు సిటీ, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు మాజీ మున్సిపల్ కమిషనర్ అరుణ రూ.30 కోట్ల అవినీతికి పాల్పడ్డారని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్ ఆరోపించారు. శనివారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. వైసీపీ నేతల ప్రోద్బలంతోనే మాజీ కమిషనర్ మున్సిపాలిటీ నిధులను వైసీపీ నేతల ఖాతాల్లోకి మళ్లించారని అన్నారు. డీజిల్, భోజనాలు, వాహనాల రిపేర్లు, ట్రేడ్ లైసెన్స్‌లు, ఇంటి పన్నులు, కొత్త ఇళ్ల నిర్మాణాల అనుమతుల్లో అక్రమ వసూళ్లు చేశారని చెప్పారు. అనుమతులు లేకుండా ఇంజనీరింగ్ శాఖ పనులను వైసీపీ కార్యకర్తలకు కటబెట్టి కమీషన్లు దండుకున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆమెపై విచారణకు ఆదేశించారని, శనివారం జరిగిన విచారణలో విస్తుపోతున్న అంశాలు వెలుగుచూస్తున్నాయని చెప్పారు. మాజీ కమిషనర్ ఉన్న క్వార్టర్స్‌లో లక్షలాది రూపాయల మునిసిపల్ శాఖ ప్రజాధనాన్ని వెచ్చించి ఫర్నిచర్, నూతన నిర్మాణాలు చేసుకున్నారని తెలిపారు. పంచాయతిరాజ్ విభాగం నుంచి డిప్యుటేషన్‌పై వచ్చిన కమిషనర్ అవినీతికి కిందిస్థాయి ఉద్యోగులు బలవుతున్నారని చెప్పారు. దొంగలు దొంగలు ఊర్లు పంచుకున్నట్లు అక్రమ సొమ్మును కమిషనర్, వైసీపీ నేతలు పంచుకున్నారని విమర్శించారు. ఈ అవినీతిపై శాఖాపరమైన విచారణ మాత్రమే కాకుండా సీబీసీఐడీ, ఏసీబీ చేత విచారణ చేయించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నేతలు ధరణి ప్రకాష్, మధు యాదవ్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

అధునాతన సాంకేతిక పరిశోధనా సంస్థల ఏర్పాటుతోనే రాష్ట్రాభివృద్ధి

ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు



చిత్తూరు సిటీ, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): అధునాతన సాంకేతిక పరిశోధనా సంస్థల ఏర్పాటుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో సైన్స్ అండ్ టెక్నాలజీ లేబొరేటరీలు ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశానని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాలన్నీ పురోభివృద్ధి చెందాలంటే సైన్స్ అండ్ టెక్నాలజీ లేబొరేటరీలు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఢిల్లీ పార్లమెంటు సమావేశాల్లో పాల్గొన్న ఎంపీ అకడమిక్ ఇన్‌స్టిట్యూషన్లో ఏర్పాటు చేసిన అడ్వాన్స్ రీసెర్చ్ లేబొరేటరీలను దేశంలో ఎన్ని ఏర్పాటు చేశారు..? ఏపీలో సైన్స్ అండ్ టెక్నాలజీ లేబొరేటరీలు నెలకొల్పారా..? వాటికి వెచ్చిస్తున్న నిధులెన్ని..? వీటి వివరాలు కోరుతూ కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాశామని పేర్కొన్నారు. కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ మంత్రి జితేంద్ర సింగ్ సానుకూలంగా స్పందించి లేఖ ద్వారా తనకు సమాధానం ఇచ్చినట్లు ఎంపీ ఆ ప్రకటనలో తెలిపారు.

లారీని ఢీకొన్న స్కూటర్ : యువకుడి మృతి

పూతలపట్టు, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ముందు వెళ్తున్న లారీని స్కూటర్ ఢీకొనడంతో ఓ యువకుడు మృతిచెందగా, మరో యువకుడు స్వల్పగాయాలతో బయటపడ్డాడు. గంగాధరనెల్లూరు మండలం ఎల్లమ్మరాజుపల్లె గ్రామానికి చెందిన మోహన్‌రెడ్డి, తేజ తిరుపతి వెళ్లి, తిరిగి చిత్తూరుకు ద్విచక్రవాహనంలో శుక్రవారం రాత్రి వస్తుండగా పూతలపట్టు మండలంలోని కిచ్చెన్నగారిపల్లె వద్ద ముందువెళ్తున్న లారీని వెనుకవైపు నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో గాయపడిన ఇద్దరిని చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా, మోహన్ రెడ్డి (20) మృతిచెందాడు. తేజ స్వల్పగాయాలతో బయటపడ్డాడు. పూతలపట్టు సీఐ కృష్ణమోహన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎరువుల దుకాణం సీజ్


రికార్డులు పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

పుంగనూరు , డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): నియోజవర్గంలోని ఎరువులు, క్రిమిసంహారక దుకాణాలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్(తిరుపతి) అధికారులు శనివారం దాడులు నిర్వహించారు. రొంపిచెర్లలో లైసెన్స్ లేకుండా నిర్వహిస్తున్న ఎరువుల దుకాణాన్ని సీజ్ చేశారు. దాడుల్లో సీఐలు ఎస్. చంద్రశేఖర్, వెంకటరవి, చంద్రశేఖర్, ధనంజయ, సిబ్బంది పాల్గొన్నారు. పుంగనూరులో ఒకటి, సదుంలో రెండు, రొంపిచెర్లలో రెండు ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఈ-పాస్ బయోమెట్రిక్ లేకుండా విక్రయం, రికార్డులకు స్టాక్ నిల్వలో రూ. 7,32,252 వ్యత్యాసం గుర్తించారు. స్టాకు విక్రయాలు నిలిపివేయాలని ఆదేశించినట్లు అధికారులు తెలిపారు.

జనవరిలో ఉపాధ్యాయినులకు బీసీవై పార్టీ అవార్డులు

పుంగనూరు, డిసెంబరు14(ఆంధ్రజ్యోతి): సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా ఉపాధ్యాయినులకు అవార్డులు ప్రదానం చేయనున్నట్లు బీసీవై పార్టీ అధినేత బోడె రామచంద్రయాదవ్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ జనవరి 3న రాష్ట్ర మహిళా ఉపాధ్యాయులకు అవార్డులు, సన్మాన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. తొలిసారిగా బీసీవై పార్టీ అధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నామన్నారు. ప్రతి జిల్లా నుంచి ఉత్తమ మహిళా ఉపాధ్యాయులను ఎంపిక చేసి జ్ఞాపికలతో పాటు అవార్డులు అందజేస్తామన్నారు. మహిళా ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఇతర వివరాల కోసం 9642266666 ఫోన్ నంబరులో సంప్రదించాలని వివరించారు.

డీఎల్ఎస్ఏ సెక్రటరీగా భారతి

చిత్తూరు లీగల్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి):చిత్తూరులో డీఎల్ఎస్ఏ సెక్రటరిగా న్యాయమూర్తి భారతి బాధ్యతలు చేపట్టారు. ఈమె కర్నూలులో జూనియర్ సివిల్ జడ్జిగా విధులు నిర్వహిస్తూ పదోన్నతిపై డీఎల్ఎస్ఏ సెక్రటరిగా వచ్చారు.

ఈఎన్‌టీ విభాగంలోని మూడు నెలల రికార్డుల పరిశీలన

తిరుపతి (వైద్యం), డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆస్పత్రికి వచ్చే రోగులకు వైద్యసేవలు అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని అలాగే ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లాలని సూచించినా అటువంటి వాటిపై విచారించి బాధితుల ఫిర్యాదు మేరకు చర్యలు చేపడతామని రుయా సూపరింటెండెంట్ రవిప్రభు హెచ్చరించారు. ఆస్పత్రిలో ఈఎన్‌టీ విభాగంలో వైద్యుల నిర్లక్ష్యంపై ఆంధ్రజ్యోతిలో 'రుయాలో ఈఎన్‌టీ సేవలు మృగ్యం' శీర్షికన శనివారం కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై సూపరింటెండెంట్ రవిప్రభు స్పందిస్తూ ఈఎన్‌టీ విభాగంలో మూడు నెలలుగా రోగులకు అందించిన వైద్య సేవలకు సంబంధించిన రికార్డులు తీసుకురావాలని ఈఎన్‌టీ విభాగాధిపతి శ్రీనివాసులను ఆదేశించారు. దీంతో అన్ని రికార్డులను ఆయన తీసుకువెళ్లడంతో వాటిని క్షున్నంగా పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలు, వైద్యుల పనితీరుపై ఆయన సిబ్బందిని, రోగులకు అడిగి తెలుసుకున్నారు. వైద్యుల నుంచి సిబ్బంది వరకు ప్రతీ ఒక్కరూ తప్పక సమయ పాలన పాటించాలని రోగులు ఇబ్బందులు పడేలా వ్యవహరిస్తే చర్యలు తప్పవని ఆయన వారిని హెచ్చరించారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అలరించిన ఘంటసాల సంగీత విభావరి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): అయినదేమో అయినది.. ప్రియా.. అంటూ సాగిన రెండో రోజు ఘంటసాల సంగీత విభావరి అందరినీ ఆకట్టుకుంది. టీటీడీ సహకారంతో తిరుపతి ఫిల్మ్ సొసైటీ మహతిలో శనివారం 'మనసు పరిమళించెనే' పేరుతో సంగీత విభావరి చేపట్టింది. ఇందులో ఘంటసాల పాటలను కళాకారులు ఆలపించి అలరించారు. ఘంటసాల జయంతి సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో టీటీడీ పాలకమండలి సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి అతిథిగా పాల్గొని మాట్లాడారు. మహతి తరహాలో తిరుపతిలో అన్నమయ్య కళాక్షేత్రం పేరుతో మరో ఆడిటోరియం నిర్మాణాన్ని చేపట్టాలని భావిస్తున్నట్లు తెలిపారు. ఇందుకు అవసరమైన సన్నాహాలు చేస్తున్నట్టు చెప్పారు. టీడీపీ నాయకుడు నరసింహయాదవ్ మాట్లాడుతూ ఘంటసాల పాటలు నేటికీ సజీవంగా ఉన్నాయన్నారు. పారిశ్రామికవేత్త పీసీ రాయలు మాట్లాడుతూ సంగీతం మానసిక ఒత్తిడిని మాయం చేస్తుందన్నారు.

సాగునీటి సంఘాల ఎన్నికల్లో టీడీపీ విజయం శుభపరిణామం

● జిల్లా పార్టీ అధ్యక్షుడు సీఆర్ రాజన్


సాగునీటి సంఘాల అధ్యక్ష, ఉపాధ్యక్షులు, టీడీపీ నేతలతో సీ.ఆర్.రాజన్

గంగాధరనెల్లూరు, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): చెరువు నీటిసంఘాలకు సంబంధించి జిల్లా వ్యాప్తంగా జరిగిన ఎన్నికల్లో చైర్మన్, వైస్ చైర్మన్‌లుగా టీడీపీకి చెందిన వారే పోటీలేకుండా ఏకగ్రీవంగా ఎన్నికకావడంతో మంచి శుభపరిణామని జిల్లా టీడీపీ అధ్యక్షుడు, ఏపీ వన్నియకుల క్షత్రియ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ సీ.ఆర్.రాజన్ అన్నారు. గంగాధరనెల్లూరు మండలంలోని 10 చెరువు నీటిసంఘాలకు అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా టీడీపీకి చెందిన ఏకగ్రీవంగా ఎన్నికకావడంతో శనివారం వారందరికీ మండల టీడీపీ కార్యాలయంలో పార్టీ అధ్యక్షుడు స్వామి దాస్ శాలువాలు కప్పి ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా సీ.ఆర్.రాజన్ వారిని అభినందించారు. పార్లమెంట్ టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి ఎర్రగుంట్ల కృష్ణమ నాయుడు, పార్లమెంట్ టీడీపీ ఉపాధ్యక్షుడు వెంకటేష్, జిల్లా టీడీపీ యాదవ సాధికార సమితి అధ్యక్షుడు శ్రీధర్‌యాదవ్, పార్లమెంట్ టీడీపీ ఎస్సీసెల్ ప్రధాన కార్యదర్శి దేవసుందరం, నాయకులు పుష్పరాజ్, బాబునాయుడు, జ్యోతిరెడ్డి, కోదండరెడ్డి, దేవరాజులునాయుడు, జ్యోతియాదవ్, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

యాదమరి-గుడియాత్తం రోడ్డు పనులకు భూమి పూజ



యాదమరి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఉపాధి నిధులు రూ.7.10కోట్లతో నిర్మించనున్న యాదమరి - గుడియాత్తం రోడ్డు పనులకు కాశిరాళ్ల వద్ద కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే మురళీమోహన్ శనివారం శంకుస్థాపన చేసి, పనులను ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ సీఎం ఆదేశాల మేరకు మరమ్మతులకు గురైన రోడ్లను బాగుచేయడంలో భాగంగా ఈ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. మండల పోలీసు స్టేషన్ నుంచి కనికాపురం వరకు 8 కి.మీ మేర నిర్మిస్తున్నామని, ఇందులో 4 కి.మీ. రోడ్డును కొత్తగా వేయనున్నామని, మిగిలిన రోడ్డుకు మరమ్మతులు చేయనున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే మురళీమోహన్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి సహకారం, కలెక్టర్ చొరవతో రెండు నెలల్లోపే ఈ రోడ్డును పూర్తిచేయనున్నట్లు చెప్పారు. పూర్తిగా డ్యామేజ్ జరిగిన చోట రోడ్డును కొత్తగా నిర్మించడం, పాక్షికంగా దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేపడుతున్నట్లు తెలిపారు. మండలంలో అవసరమైన చోట్ల రోడ్ల నిర్మాణం పనులు చేపడతామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, ఆర్ అండ్ బీ ఈఈ శ్రీనివాసులు, పీఆర్ ఈఈ చంద్రశేఖర రెడ్డి, తహసీల్దార్ పార్థసారథి, ఎంపీడీవో వేణు, మండల టీడీపీ అధ్యక్షుడు మురార్జీ యాదవ్, ప్రధాన కార్యదర్శి వెంకటేష్ రటీ, జనసేన మండల అధ్యక్షుడు కుమార్, సర్పంచ్‌లు పత్తిపాటి భగవతి, హేమయ్య నాయుడు, భజలింగం, నాయకులు హేమగిరి, వల్లేరు అమరనాథ నాయుడు, గుణశేఖర్, చిత్రా నాయుడు, గోపి గౌడ్, అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



సైనిక అధికారులతో చర్చిస్తున్న పీఎస్ఎం - పొన్నుస్వామి పార్థివదేహానికి నివాళులర్పిస్తున్న పీఎస్ఎం

జవాన్‌కు అధికార లాంఛనాలతో అంత్యక్రియలు

కుప్పం రూరల్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): జమ్ముకాశ్మీర్‌లో అనారోగ్యంతో మృతి చెందిన జవాన్ పొన్నుస్వామి(23)కి శనివారం అధికారిక సైనిక లాంచనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. మండలంలోని మంకలదొడ్డి పంచాయతీ ములకలపల్లె గ్రామానికి చెందిన పొన్నుస్వామి రెండేళ్ల క్రితం సైన్యంలో చేరాడు. జమ్ముకాశ్మీర్‌లో విధులు నిర్వహిస్తూ అనారోగ్యం బారిన పడి మృతి చెందుడు. ఆయన పార్థివదేహన్ని ఆర్మీ అధికారులు శనివారం ములకలపల్లికి తీసుకువచ్చారు. అధికారిక సైనిక లాంచనాలతో అంత్యక్రియలు నిర్వహించారు.ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం జవాన్‌కు నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఆర్మీ అధికారులతో పొన్నుస్వామి కుటుంబానికి అందాల్సిన సహాయ సహకారాల గురించి చర్చించారు.

స్నేహితులను కలవడానికి వచ్చి..

● ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న లారీ
● ప్రియుడి ఎదుటే ప్రేయసి దుర్మరణం



హేమలత (ఫైల్ ఫొటో) - ఘటనా స్థలంలో విలపిస్తున్న వినయ్

శ్రీకాళహస్తి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): వారిద్దరూ ప్రేమికులు.. స్నేహితులను కలవడానికి తిరుపతికి వచ్చారు.. తిరుగు ప్రయాణంలో శ్రీకాళహస్తి పట్టణంలోని వీఎంపల్లి వద్ద శనివారం మధ్యాహ్నం చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో ప్రియురాలు మరణించింది. ప్రియుడు ఆవేదనతో కుంగిపోయాడు. బాధితుడి వివరాల మేరకు.. నెల్లూరు జిల్లా సంగం సమీపంలోని కొరిమెర్లకి చెందిన వినయ్(23), కావలి సమీపంలోని జలదంకి గ్రామానికి చెందిన హేమలత(23) డిగ్రీ పూర్తి చేసి, మూడేళ్ల క్రితం నెల్లూరులోని నైపుణ్యాభివృద్ధి శిక్షణ సంస్థలో శిక్షణ పొందారు. శిక్షణానంతరం చెన్నైలోని ఓ ప్రైవేటు టెలికాలింగ్ సంస్థలో ఉద్యోగంలో చేరారు. ఆ సమయంలో వీరి స్నేహం ప్రేమగా మారింది. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం ఇద్దరూ కలిసి తిరుపతిలో స్నేహితులను కలిసేందుకు వచ్చారు. వీరితో పాటు నెల్లూరుకు చెందిన విజయ్ కూడా వచ్చాడు. స్నేహితులను కలిసి తిరుమలకు వెళ్లి శనివారం నెల్లూరుకు బయలుదేరారు. రెండు ద్విచక్ర వాహనాలపై వెళుతుండగా శ్రీకాళహస్తి పట్టణం వీఎంపల్లి వద్ద కర్ణాటక నుంచి విజయవాడకు రైలు చక్రాల లోడుతో వెళుతున్న లారీ పక్కన భాగం హేమలత బ్యాగును తగులుకుంది. రోడ్డు పక్కన మట్టిపై ద్విచక్ర వాహనం సహా వినయ్ పడిపోయాడు. హేమలత లారీ కింద పడటంతో నుజ్జునుజ్జు అయ్యింది. ప్రేయసి మరణాన్ని చూసిన వినయ్ కుప్పకూలిపోయాడు. విజయ్ వినయ్‌ను సముదాయించాడు. హృదయ విదారక ఘటన చూసిన వారి గుండెలన్నీ చెమ్మగిల్లాయి. శ్రీకాళహస్తి రెండవ పట్టణ పోలీసులు లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని, హేమలత మృతదేహన్ని శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రి తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

రాజేశ్వరిమూర్తి కృషి చిరస్మరణీయం


రాజేశ్వరిమూర్తికి నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే సుగుణ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): పద్మావతి కాలేజీ అభివృద్ధికి ఎంతో కృషి చేసిన రాజేశ్వరిమూర్తి కృషి చిరస్మరణీయమైనదని పలువురు వక్తలు కొనియాడారు. 104 ఏళ్ల వయసులో అనారోగ్యంతో మృతిచెందిన పద్మావతి కళాశాల వ్యవస్థాపక ప్రిన్సిపాల్ రాజేశ్వరిమూర్తి సంతాప సభ శనివారం ఆ కళాశాలలో నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, విశ్రాంత ప్రిన్సిపాల్ స్వరాజ్యలక్ష్మి, పద్మావతి డిగ్రీ, జూనియర్ కాలేజీ ప్రిన్సిపాళ్లు భద్రమణి, భువనేశ్వరీదేవి, టీటీడీ పీఆర్వో నీలిమ, విశ్రాంత తెలుగు లెక్చరర్ డాక్టర్ డీఎం ప్రేమావతి తదితరులు మాట్లాడారు. 30 మంది విద్యార్థులతో ఆరంభమైన కళాశాలకు భూసేకరణ నుంచీ అన్ని రకాల అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడంలో ఆమె కృషి చారిత్రాత్మకమైనదని తెలిపారు. అప్పట్లోనే అమెరికాకు వెళ్లి భవన నిర్మాణాల నమూనా పరిశీలించి వచ్చారని అన్నారు. కళాశాల, హాస్టల్, లైబ్రరీ భవనాల ఏర్పాటులో కీలక పాత్ర పోషించారని కీర్తించారు. కొలంబియా యూనివర్సిటీలోనూ పరిశోధనలు చేశారని తెలిపారు. యూఎస్ఏలోనూ విద్యారంగంలో కృషిచేసి అత్యున్నత గౌరవాన్ని పొందారని గుర్తుచేశారు. రాజేశ్వరిమూర్తి కృషికి గుర్తుగా కళాశాల ప్రాంగణంలో విగ్రహం ఏర్పాటు చేయాలని తీర్మానించారు. ఇందుకు టీటీడీ నుంచీ అనుమతి తీసుకోవాలని నిర్ణయించారు. విగ్రహ ఏర్పాటుకు పూర్వ విద్యార్థుల నుంచి విరాళాలను సేకరించాలని భావిస్తూ ఉన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, పూర్వ ప్రస్తుత విద్యార్థులు పాల్గొన్నారు.

పండుగపూట విషాదం

● అగ్నిప్రమాదంలో టీడీపీ కార్యకర్త మృతి

పాలసముద్రం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): పాలసముద్రం మండలంలో దీపం తెచ్చిన తంటాతో ఓ వ్యక్తి తీవ్రగాయాలకు గురై ఆస్పత్రిలో చికిత్సపొందుతూ మృతిచెందిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. పాలసముద్రం మండలంలోని రామలింగాపురం గ్రామానికి చెందిన కేశవులు నాయుడు (55) దివ్యాంగుడు. ఇతడు ఇంటివద్దనే ఓ ప్రొవిజన్ స్టోర్ నిర్వహిస్తున్నారు. కార్తీక పండగ సందర్భంగా కేశవులునాయుడి భార్య ఉష ఇంటిముందు వరుసగా, ఇంటిలోపల ప్రతి గదిలో ప్రమిదలతో దీపాలు వెలిగించింది. శుక్రవారం రాత్రి కేశవులు నాయుడు దుకాణాన్ని మూసివేసే క్రమంలో అదుపుతప్పి పెట్రోలు క్యాన్‌పై పడిపోయాడు. దీంతో పెట్రోలు క్యాన్ మూత ఊడిపోయి, దానిలోని పెట్రోలు ఆయనపైన, పక్కనేఉన్న దీపంపై పడింది. దీంతో ఒక్కసారిగా అతడితో పాటు షాపులోని వస్తువులకు అంటుకుని మంటలు వ్యాపించడంతో షాపు కాలిపోయింది. కేశవులు నాయుడికి తీవ్ర గాయాలు కావడంతో వెంటనే చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి 108 అంబులెన్స్‌లో తరలించారు. ఆయన చికిత్స పొందుతూ శనివారం ఉదయం మరణించారు. టీడీపీ కార్యకర్త అయిన కేశవులు నాయుడి మృతి చెందిన విషయం తెలుసుకున్న ఆ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి భీమనేని చిట్టిబాబు నాయుడు శనివారం మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. మృతుడి భార్య ఉషకు రూ.10వేలు ఆర్థికసహాయం చేశారు. కార్తీక పండగ సందర్భంగా కేశవులు నాయుడు మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ కార్యక్రమంలో చిత్తూరు పార్లమెంట్ టీడీపీ కార్యదర్శి వాసు నాయుడు, నేతలు జె.విజయకుమార్, బాబుయాదవ్, మణి నాయుడు, బాలాజి నాయుడు, భాస్కర నాయుడు పాల్గొన్నారు.

బీసీఎన్ విద్యా సంస్థల చైర్మన్‌కు పురస్కారం


ఐసీటీ ప్రతినిధుల నుంచి అవార్డు అందుకుంటున్న బీసీ.నాగరాజ్

కుప్పం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): బీసీఎన్ విద్యా సంస్థల చైర్మన్ బీసీ. నాగరాజ్‌కు రాష్ట్ర ఐసీటీ అకాడమీ మోంగోడిబి సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ అవార్డు ప్రకటించింది. మోంగోడిబి బెస్ట్ కో-ఆర్డినేటర్(రాయలసీమ) అవార్డును కుప్పం ఇంజినీరింగ్ కళాశాల ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ డి.జయకుమార్‌కు ప్రకటించింది. అకడమిక్ అవుట్‌పుట్, పరిశ్రమల అవసరాల మధ్య అంతరాన్ని తగ్గించి ప్రతి అభ్యాసకుడు పరిశ్రమ స్థాపనకు సిద్ధం చేసే ఉద్దేశంతో కుప్పం ఇంజినీరింగ్ కళాశాల, ఐసీటీ అకాడమీ మధ్య ఒక వ్యూహాత్మక భాగస్వామ్యం కుదిరింది. శనివారం ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమాల్లో ఈ అవార్డులను వారికి ప్రదానం చేశారు. కుప్పం ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.సుధాకర్‌బాబు మాట్లాడుతూ విద్యార్థులు, అధ్యాపకుల మధ్య సాంకేతికత , నైపుణ్యాభివృద్ధిని పెంచడమే తమ ఒప్పందం ముఖ్యోద్దేశమన్నారు. కార్యక్రమంలో ఐసీటీ అకాడమీ రిలేషన్‌షిప్ మేనేజర్ నాగేశ్వరయ్య, కేఈసీ వైస్ చైర్మన్ డాక్టర్ ఎన్.సునీల్‌రాజ్, సీఈవో సాగర్ రాజ్, వైస్ ప్రిన్సిపాల్ ఎస్.భాస్కరన్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయసేవాధికార సంఘ సభ్యుడిగా హరినాయుడు



చిత్తూరు కల్చరల్, డిసెంబరు 14: ఉమ్మడి చిత్తూరు జిల్లా న్యాయసేవాధికార సంస్థ సభ్యుడిగా ప్రముఖ సాహితీవేత్త, విశ్రాంత అధ్యాపకుడు వి.హరినాయుడును రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ నియమించింది. ఈ పదవిలో ఆయన రెండు సంవత్సరాలు కొనసాగనున్నారు. అదేవిధంగా సంతపేటకు చెందిన ధనంజయులు నాయుడు, జనార్ధన రెడ్డిలు ఉమ్మడి చిత్తూరు జిల్లా న్యాయసేవాధికార సంస్థ సలహా సంఘ సభ్యులుగా నియమింపబడ్డారని ఆయన తెలిపారు.

శ్వాసకోశ వ్యాధిపై అవగాహన సదస్సు ప్రారంభం



పీఈఎస్‌లో సదస్సు ప్రారంభిస్తున్న వైద్య ప్రముఖులు

కుప్పం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక పీఈఎస్ ఆసుపత్రిలో వైద్య కళాశాల ఆధ్వర్యంలో శనివారం చిన్నపిల్లల శ్వాసకోశ వ్యాధి సంక్రమణ అవగాహన సదస్సు నిర్వహించారు. దీనికి వైద్య కళాశాల డీన్ అండ్ ప్రిన్సిపాల్ డాక్టర్ హెచ్‌ఆర్.కృష్ణారావు, ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంటు డాక్టర్ ఎన్‌కే.సుబ్రమణ్యం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్నపిల్లల్లో ఎక్కువసేపు ఆయాసం, నెమ్ము, దగ్గు, పొట్ట ఎగరేయడం వంటి లక్షణాత గమనిస్తే వెంటనే అవసరమైన పరీక్షలు చేయించాలన్నారు. వ్యాధి నిర్ధారించుకోవాలన్నారు. చల్లని వాతావరణం. ఎలర్జీ బ్యాక్టీరియా వల్ల ఎక్కువగా నిమోనియా ఇన్‌ఫెక్షన్ వస్తుందన్నారు. ఈలక్షణాలను గుర్తించిన వెంటనే వైద్యం అందించాలని సూచించారు. కార్యక్రమంలో పీఈఎస్ చిన్నపిల్లల విభాగాపధిపతి డాక్టర్ రాజేంద్ర నాయుడు, రేడియాలజీ ప్రొఫెసర్ డాక్టర్ వెంకటరమణ, అసిస్టెంట్ మెడికల్ సూపరింటెండెంటు డాక్టర్ శ్రీధర్, డాక్టర్ మహన్ రూప, మత్తు వైద్యులు డాక్టర్ మోహన్, వివిధ ప్రాంతాల వైద్యులు పాల్గొన్నారు.

ఇనుప స్తంభాలతో పొంచి ఉన్న ప్రమాదం



కల్లూరు, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం పాళెం పంచాయతీ కొంగరవారిపల్లి వీధుల్లోని ఇనుప విద్యుత్ స్తంభాలతో ప్రమాదం పొంచి ఉంది. చాన్నాళ్ల క్రితం వీటినిఏర్పాటుచేశారు. వీటితో ప్రమాదాలను గుర్తించిన అధికారులు కాలక్రమేనా సిమెంటు స్తంభాలను మార్చారు. ఇక్కడి వీధుల్లో మాత్రం మార్చలేదరు. విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. వర్షాల సమయంలో షాక్ కొడతాయేమోనని వారు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా స్పందించి ఇనుప స్తంభాలను తొలగించి సిమెంటువి ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

సాగునీటి సంఘాల సారథులకు సత్కారం



రామకుప్పం, డిసెంబరు 14: మండలంలో చెరువుల పరిరక్షణకు సాగునీటి వినియోగదారుల సంఘాల చైర్మెన్లు, వైస్‌చైర్మెన్లు, డైరెక్టర్లతో కలసి చెరువుల పరిరక్షణకు కృషి చేయాలని టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీసెల్ కార్యనిర్వాహక కార్యదర్శి పత్రనారాయణాచారి, పార్టీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు, మాజీ ఎంపీపీ ఆంజినేయరెడ్డిలు కోరారు. శనివారం సాయంత్రం పార్టీ కార్యాలయంలో కొత్తగా ఎన్నికైన సాగునీటి సంఘాల చైర్మెన్లు, వైస్‌చైర్మెన్లలతో వారు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెరువుల ఆక్రమణల తొలగింపు, వ్యర్థాల డంపు అంశాలపై చర్యలు తీసుకోవాలన్నారు. సంఘాల చైర్మెన్లు, వైస్‌చైర్మెన్లను ఘనంగా సత్కరించారు.

భూసమస్యలు పరిష్కరించాలని సీఎంకు వినతి



శాంతిపురం, డిసెంబరు14: రెడ్లపల్లెలో భూసమస్యలను పరిష్కరించాలని పలువురు గ్రామస్థులు సీఎం చంద్రబాబును కలిసి వినతి పత్రం అందజేశారు. బాధితులు శీనప్ప, జయప్పల కథనం మేరకు వివరాలు...వారు రాళ్ళబూదుగూరు వద్ద 14ఏళ్ళ క్రితం రెండెకరాల భూమి కొనుగోలు చేశారు. భూమిని విక్రయించిన వారే ప్రస్తుతం తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని వారు పేర్కొన్నారు. కొందరు నేతలు అధికారులపై ఒత్తిడి తెచ్చి విక్రయించిన వారికి వత్తాసు పలుకుతున్నారన్నారు. విధిలేని పరిస్థితిలో కలిసి గోడు వెళ్ళబోసుకున్నామన్నారు. సీఎం సానుకూలంగా స్పందించి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారని వారు తెలిపారు. సీఎంను కలిసిన వారిలో మాజీ ఎంపీటీసీ రామచంద్రనాయుడు, మోడల్‌స్కూల్ ఎస్‌ఎంసీ చైర్మెన్ మంజునాథ్, రాజప్ప ఉన్నారు.

ఆదానీతో విద్యుత్ ఒప్పందాలు రద్దుచేయాలి :సీపీఎం



ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు, కార్యకర్తలు

పలమనేరు, డిసెంబరు14 (ఆంధ్రజ్యోతి) ఆదానితో విద్యుత్ ఒప్పందాలను రద్దుచేయాలని కోరుతూ శనివారం ఏడీఈ కార్యాలయం ఎదుట సీపీఎం నాయకులు ధర్నా చేపట్టారు. ఈసందర్భంగా సీపీఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు, నాయకుడు గిరిధర గుప్తా మాట్లాడుతూ ట్రూ-అప్‌చార్జీలను, స్మార్టు మీటర్ల విధానం రద్దుచేయాలన్నారు. విద్యుత్ బిల్లులను తగలబెట్టి నిరసనను వ్యక్తం చేశారు. వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా కార్యదర్శి ఓబుల్‌రాజు, కుల వివక్ష పోరాట సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈశ్వర్, గుప్తా, శేఖర్, రాజా, జయంతి, ధనమ్మ, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల ప్రిన్సిపాల్‌కు లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు



అవార్డుతో ప్రిన్సిపాల్ కేథలిన్, జాకబ్ దంపతులు, తదితరులు

పలమనేరు, డిసెంబరు14 (ఆంధ్రజ్యోతి) : ఈమాస్ ఇంగ్లీషుమీడియం పాఠశాల ప్రిన్సిపాల్ కేథలిన్‌ను హైదరాబాద్‌కు చెందిన ఈటీటెక్ సంస్థ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డుతో సత్కరించింది. ఈ విద్యాసంవత్సరంలో ఏపీలో ఐసీఎస్‌ఈ సిలబస్ బోధిస్తున్న పాఠశాలల్లో ఐదింటిని ఉత్తమ పాఠశాలలుగా ఎంపిక చేసి అవార్డులు అందజేశారు. ఇందులో పలమనేరు ఈమాస్ పాఠశాల కూడా చోటు దక్కించుకొంది. ఈమాస్ పాఠశాల ప్రిన్సిపాల్ కేథలిన్‌కు ఈటీటెక్ సంస్థ లైఫ్‌టైమ్ అవార్డును అందజేశారు.

ప్రార్థనా స్థలాల వివాద పిటిషన్ల నిలిపివేత హర్షణీయం



మాట్లాడుతున్న జమీర్‌లాల్,తదితరులు

పుంగనూరు , డిసెంబరు14(ఆంధ్రజ్యోతి): ప్రార్థనా స్థలాల వివాదాల పిటిషన్లను సుప్రీంకోర్టు నిలిపివేయడం హర్షణీయమని ఎస్‌డీపీఐ జిల్లా అధ్యక్షుడు జమీర్‌లాల్ పేర్కొన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 6న ప్రార్థనా స్థలాల చట్టం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సోషల్ డెమోక్రటిక్ పార్టీ నిరసన కార్యక్రమాలు నిర్వహించిందన్నారు. దీంతో సుప్రీంకోర్టు స్పందించి పిటిషన్లను నిలిపివేసిందన్నారు. తమతో కలసి వచ్చిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో నాయకులు యూసుఫ్, అన్వర్ బాషా, యునుస్, సిద్దిక్, షా, ముభారక్, మహబూబ్ తదితరులు పాల్గొన్నారు.

హైందవ శంఖారావానికి తరలిరండి : వీహెచ్‌పీ



సమావేశంలో మాట్లాడుతున్న వీహెచ్‌పీ ప్రతినిధులు

వి.కోట, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): విజయవాడలో జరిగే విశ్వ హిందూ పరిషత్ హైందవ శంఖారావం కార్యక్రమానికి ప్రతి హిందువూ తరలిరావాలని ఆ సంస్థ ప్రఖండ అధ్యక్షుడు సిద్దయ్య కోరారు. శనివారం వి.కోట లోని వేణుగోపాలస్వామి ఆలయం ఆవరణంలో మండల స్థాయి సమావేశం నిర్వహించారు. కరపత్రాలు, పోస్టర్లరు ఆర్‌ఎస్‌ఎస్ సహ ప్రాంత కుటుంబ ప్రబోధక్ ప్రభాకర్‌రాజు ఆవిష్కరించారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ, ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ నేతలు, కార్యకర్తలు, దేవాలయాల ధర్మకర్తలు పాల్గొన్నారు.

పొలాల్లో అక్రమంగా విద్యుత్ వైర్లు పెట్టొద్దు

సోమల, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): పొలాల్లో అక్రమంగా విద్యుత్ వైర్లు తీయడం చట్టరీత్యానేరమని ట్రాన్స్‌కో ఏఈ మహేంద్రరెడ్డి తెలిపారు. ఆవులపల్లె, పేటూరు విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో కొందరు అటవీ వన్యప్రాణులు ప్రవేశించకుండా పొలాల చుట్టూ విద్యుత్ వైర్లు పెడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. విద్యుత్‌ను అక్రమంగా వాడటంతోపాటు ప్రాణనష్టం జరిగితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శనివారం విద్యుత్ సిబ్బంది పొలాల్లో తనిఖీలు చేపట్టారు. రైతులకు సూచనలు చేశారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

చౌడేపల్లె, డిసెంబరు14:(ఆంధ్రజ్యోతి): హెచ్‌సీసీబీ, వై4డీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య చికిత్స శిబిరం నిర్వహించనున్నట్లు సంస్థ నిర్వాహకులు పేర్కొన్నారు. శనివారం వారు స్థానిక బస్టాండులో మాట్లాడుతూ..స్థానిక హైస్కూల్‌లో ఈనెల 15న అన్ని రకాల రోగాలకు చికిత్స అందిస్తామన్నారు. ఉచితంగా మందులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కంటి పరీక్షలు కూడా నిర్వహించనున్నట్లు వివరించారు.

17న పెన్షనర్ల దినోత్సవం

కుప్పం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎన్జీవో హోమ్‌లో ఈనెల 17న జాతీయ పెన్షనర్ల దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు కుప్పం పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు వీజీ.సెల్వం, ప్రధాన కార్యదర్శి కె.గణేశ్ పిళ్లైలు తెలిపారు. ఈ సందర్భంగా సీనియర్ పెన్షనర్లకు సన్మానం చేస్తామన్నారు. పెన్షనర్ల పితామహుడు నాకారాకు నివాళి అర్పిస్తామన్నారు. నియోకవర్గంలోని పెన్షనర్లు హాజరు కావాలని ఆయన కోరారు.

మామడుగులో స్వల్ప ఉద్రిక్తత

గంగవరం,డిసెంబరు14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాలుగు సాగునీటి సంఘాలకు శనివారం నిర్వహించిన ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి చెందిన నాయకులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మామడుగులో ఎన్నికలు ఏకపక్షంగా నిర్వహిస్తున్నారని ఆరోపిస్తూ సర్పంచ్ భాస్కర్‌రెడ్డి పోలీంగ్ కేంద్రంలోనికి ప్రవేశించేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకొన్నారు. ఆయన పోలీసులతో వాగ్వాదానికి దిగారు. తెలుగుదేశం, వైసీపీలకు చెందిన పలువురు చేరుకోవడంతో స్వల్ప ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పోలీసులు, అధికారులు ఇరువురికీ నచ్చజెప్పడంతో వివాదం సద్దుమణిగింది.

మేటిమంద నుంచి శబరిమలైకు పాదయాత్ర

సోమల, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఇరికిపెంట పంచాయతీ మేటిమంద నుంచి పలువురు అయ్యప్ప భక్తులు శబరిమలైకు పాదయాత్ర చేపట్టారు. ఈక్రమంలో వారు శనివారం స్థానిక ఆలయంలో పూజలు జరిపారు. పెద్దఉప్పరపల్లెలోని పలువురు భక్తులు స్థానిక అయ్యప్పస్వామి ఆలయంలో పూజలు జరిపి శబరిమలైకు నడకగా బయలుదేరారు. ఆదివారం మదనపల్లె సమీపంలోని అంగళ్ల నుంచి మహా పాదయాత్ర బృందంతో కలసి శబరిమలైకు బయలుదేరుతున్నట్లు భక్తులు తెలిపారు.

నేడు సోమలలో విశ్వహిందూ పరిషత్ సమావేశం

సోమల, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) మండల కేంద్రంలోని అభయాంజనేయస్వామి ఆలయం వద్ద ఆదివారం విశ్వహిందూ పరిషత్ మండల స్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు బీజేపీ నియోజక వర్గం కన్వీనర్ మదన్ మోహన్‌బాబు తెలిపారు. జనవరి 5న విజయవాడలో జరిగే హైందవ శంఖారావం సభను విజయవంతం చేసేందుకు సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

వైభవంగా దత్తాత్రేయ జయంతి



పుంగనూరు రూరల్, డిసెంబరు14(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని 50రాళ్ల మొరవ వద్ద దత్తాత్రేయ స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. దత్తాత్రేయస్వామి జయంతి సందర్భంగా ఉదయాన్నే గణపతి పూజలు, కలశంపూజ, నవగ్రహ పూజ, అభిషేకం, హోమాలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు.

కుక్కల దాడిలో గాయాలు



చికిత్స పొందుతున్న తపన్

పుంగనూరు రూ రల్, డిసెంబరు14(ఆంధ్రజ్యోతి): కుక్కల దాడిలో ఒడిశావాసి తీవ్రంగా గాయపడ్డాడు. బో రువెల్‌లో కార్మికుడుగా పనిచేస్తున్న తపన్‌పై శనివారం రాంనగర్ ప్రాంతంలోని వీధికుక్కలు దాడి చేసి గాయపరిచాయి. ఒడిశా ప్రాంతానికి చెందిన ఇతడిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

చిత్తశుద్ధి లేక చెత్త సంపద కేంద్రం ఇలా..

● గ్రీన్ అంబాసిడర్లు లేరు ● తుప్పుపడుతున్న పరికరాలు, వాహనాలు



చెత్త సంపద తయారీ కేంద్రం



నిరుపయోగంగా మారిన చెత్త తొట్టెలు



శిథిలావస్థకు ఆటో,రిక్షా

పుంగనూరు, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): చంద్రమాకులపల్లెలో చెత్తసంపద తయారీ కేంద్రం మూలకు చేరింది. చెత్త ద్వారా పంచాయతీలకు ఆదాయం సమకూరాలనే లక్ష్యంతో 2014-19లో టీడీపీ ప్రభుత్వం ఈ కేంద్రాలను ప్రారంభించింది. అందులో భాగంగానే ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధుల కింద రూ.4.80 లక్షలతో నిర్మించిన చెత్త సంపద తయారీ కేంద్రాన్ని 2018 జూన్‌లో నాటి సీఎం చంద్రబాబు ప్రారంభించారు. కేంద్రానికి స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా చెత్త సేకరణ, తరలింపునకు ఆటోట్రాలీ, ఆరు రిక్షాలు సమకూర్చారు. నిర్వహణకు ఐదుగురు గ్రీన్ అంబాసిడర్లు ఉండేవారు. వైసీపీ ప్రభుత్వం రావడంతో ఈ కేంద్రం నిర్వీర్యమైంది. గ్రీన్ అంబాసిడర్లలో ముగ్గురు మృతి చెందారు. మిగిలిన ఇద్దరికీ కనీస వేతనం కూడా చెల్లించక(రోజుకు రూ.200) పూర్తి స్థాయిలో పని చేయడానికి కార్మికులు ఆసక్తి చూపడంలేదు. ప్రస్తుతం మహిళ, మరో పురుషుడు మాత్రమే ఉండటంతో కేంద్రం మూతపడింది. బృందావనంలో మొక్కలు నాటి ప్రజలు కూర్చోడానికి బెంచీలు వేసినా గేట్లకు తాళాలు వేశారు. రిక్షాలు, వాహనాలు, పరికరాలు శిథిలావస్థకు చేరుతున్నాయి. ఈవిషయంపై పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ తాను బదిలీపై వచ్చి నెల రోజులైందన్నారు. గ్రీన్ అంబాసిడర్ల నియామకానికి ప్రయత్నిస్తున్నామన్నారు. త్వరలోనే కేంద్రాన్ని ఉపయోగంలోకి తెచ్చి ఆదర్శంగా తయారు చేస్తామన్నారు.

లోక్‌అదాలత్‌లో పలు కేసుల పరిష్కారం







పలమనేరులో సివిల్ జడ్జి ఆదినారాయణ -పుంగనూరులోక్‌అదాలత్‌లో న్యాయమూర్తి ఆరిఫా కుప్పం కోర్టులో జడ్జి ఉమాదేవి

పలమనేరు డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): జాతీయ లోక్‌అదాలత్‌లో 130 కేసులు పరిష్కారమయ్యాయని సీనియర్ సివిల్ జడ్జి, న్యాయ సేవా అధికార సంస్థ చైర్మన్ ఆదినారాయణ తెలిపారు. శనివారం పలమనేరు సివిల్ కోర్టులో ఈ కేసులు పరిష్కారమయ్యాయి. వివిధ కేసుల్లో రూ.73.84 లక్షలు రికవరీ అయ్యాయన్నారు. రాజీమార్గమే రాజమార్గంగా ఎంచుకుని న్యాయవాదులు, కక్షిదారులు, పోలీసులు సహకరించి కేసులు పరిష్కారం కావడానికి సహకరించారన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మీపతి, సీనియర్ న్యాయవాదులు, పోలీసులు, కోర్టు సిబ్బంది ఉన్నారు.

● పుంగనూరు రూరల్: లోక్‌అదాలత్‌లో 133 కేసులను పరిష్కరించినట్లు సీనియర్ సివిల్ జడ్జీ ఆరిఫా తెలిపారు. శనివారం పుంగనూరు కోర్టు ఆవరణలో జరిగిన లోక్ అదాలత్‌లో 10 సివిల్, 15 బ్యాంకు, 108 క్రిమినల్ కేసులు కేసులను పరిష్కరించినట్లు పేర్కొన్నారు. న్యాయవాదుల సంఘ అధ్యక్షుడు చెన్నకేశవులు, న్యాయవాదులు, కక్షిదారులు పాల్గొన్నారు.

● కుప్పం: కుప్పం కోర్టులో ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి డి.ఉమాదేవి ఆధ్వర్యంలో 120 కేసులన పరిష్కరించారు. సెటిల్‌మెంట్ కేసుల్లో రూ.6,62,058, 56 క్రిమినల్ కేసుల్లో 25,03,890 చెల్లించేలా ఆదేశించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రప్ప, లోక్ అదాలత్ సభ్యులు జి.పుష్పలత, న్యాయవాదులు, పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి సంఘం డైరెక్టర్‌గా టీడీపీ రాష్ట్ర నేత



నారాయణాచారి

రామకుప్పం, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలానికి చెందిన టీడీపీ సీనియర్ నేత సాగునీటి వినియోగదారుల సంఘం డైరెక్టరుగా ఎన్నికయ్యారు. కెంచనబల్ల తోట్లచెరువు సాగునీటి సంఘంలోని ఓ ప్రాదేశిక నియోజకవర్గంలో టీడీపీ బీసీసెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పత్రనారాయణాచారి తప్ప మిగిలిన ఓటర్లంతా వైసీపీ సానుభూతిపరులే. వైసీపీ ఎన్నికలకు దూరంగా ఉండటంతో బలవంతంగా డైరెక్టరు పోస్టు కట్టబెట్టేందుకు టీడీపీ శ్రేణులు ఇష్టపడలేదు. దీంతో పార్టీ శ్రేణుల ఒత్తిడి మేరకు నారాయణాచారి శనివారం డైరెక్టరు పదవికి నామినేషన్ దాఖలు చేసి ఎన్నికయ్యారు. మండల తెలుగుదేశం ప్రధాన కార్యదర్శిగా ఆయన 26సంవత్సరాలపాటు వ్యవహరించారు.

పారిశ్రామికవేత్తలకు సహకరిస్తాం: కలెక్టర్



జ్యోతి వెలిగిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే మురళీమోహన్

పూతలపట్టు, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు టీడీపీతో పాటు జిల్లా యంత్రాంగం పూర్తి సహాయసహకారాలందిస్తుందని పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ అన్నారు. పూతలపట్టు మండలం వడ్డేపల్లి పంచాయతీ బందార్లపల్లె గ్రామం వద్ద రూ.23 కోట్లతో నిర్మించనున్న సోలార్ ప్రాజెక్టుకు కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే మురళీమోహన్ శనివారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూతలపట్టు నియోజకవర్గంలో పారిశ్రామికవేత్తలు ముందుకు వచ్చి పరిశ్రమలు ఏర్పాటు చేసి, నిరుద్యోగ నిర్మూలనకు కృషిచేయాలన్నారు. వ్యవసాయ, ఉద్యానవన రంగాల పైనే ఆధారపడకుండా పారిశ్రామికవేత్తలు పరిశ్రమల స్థాపనకు కూడా కృషిచేయాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పారిశ్రామికవేత్తలతో తమవంతు సహాయాన్ని అందిస్తారన్నారు. నియోజకవర్గంలో పారిశ్రామిక అభివృద్ధికి అనుకూలమైన వాతావరణం కల్పించడం ద్వారా ఉపాధి అవకాశాలను పెంచడం, స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు అందించడం ప్రధాన లక్ష్యమన్నారు. పరిశ్రమల అభివృద్ధి ద్వారా పూతలపట్టు నియోజకవర్గం ఆర్థికంగా, సామాజికంగా దృఢంగా ఎదగడమే తన ధ్యేయమన్నారు. తహసీల్దార్ గుర్రప్ప, ఎంపీడీవో నాగరాజు, టీడీపీ నేతలు దొరబాబు చౌదరి, యువరాజు నాయుడు, ప్రతాపనేని చంద్రమౌళి, ఇంద్రసేన నాయుడు, ఎన్‌పీ ధరణి, గంగారపు హరి, చంద్రబాబు, నవీన్ చౌదరి పాల్గొన్నారు.

ఆర్థికాభివృద్ధికి బ్యాంకు రుణాలు తోడ్పడాలి

చిత్తూరు సెంట్రల్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): బ్యాంకు రుణాలు ప్రతి మహిళ ఆర్థికాభివృద్ధికి తోడ్పడాలని సెర్ప్ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, సీఈవో పాండ్యన్, స్త్రీనిధి ఎండీ శ్రీహరి ప్రసాద్ శనివారం విజయవాడ నుంచి స్త్రీనిధి క్రెడిట్ కోపరేటివ్ ఫెడరేషన్ లిమిటెడ్ రాష్ట్ర స్థాయి 18వ జనరల్ బాడీ సమావేశం గూగుల్ మీట్ ద్వారా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రతి లోను ఆదాయ అభివృద్ధి కార్యక్రమాలకు ఉపయోగపడాలని, క్షేత్రస్థాయిలో నిధులు దుర్వినియోగం కాకుండా చూడాలన్నారు. రుణాల రికవరీతో పాటు సిబిల్ స్కోర్ పెంచాలన్నారు. సీఈవో మాట్లాడుతూ డిజిటల్ పేమెంట్ విధానం చేయడంతో పాటు తరచూ సమావేశాలు నిర్వహించాలన్నారు. డీఆర్‌డీఏ ఇన్‌చార్జి పీడీ శ్రీదేవి, స్త్రీనిధి ఏజీఎం వెంకటప్రసాద్, డీపీఎం రవికుమార్, జిల్లా సమాఖ్య మండల అధ్యక్షులు పాల్గొన్నారు.

వైభవంగా పులిగుండు గిరిప్రదక్షిణ

పెనుమూరు, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని పులిగుండు శివాలయంలో వెలసిన పార్వతీపరమేశ్వరుల ఆలయంలో కార్తిక పౌర్ణమి వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. భక్తులు ఆలయంలో దీపాలను వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. అర్చకులు ఉదయం వివిధ రకాల అభిషేకాలతో పుష్పాలంకరణచేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. సాయంత్రం స్వామివారిని శేష వాహనంపై అలంకరించి కొత్తరోడ్డు, రాణావేణుగోపాలపురం, సీఎస్. అగ్రహారం మీదుగా గిరిప్రదక్షిణలో ఊరేగింపు నిర్వహించారు. వందలాది భక్తులు పాల్గొన్నారు. భక్తులకు అన్నదానం చేశారు. నిర్వాహకులు షణ్ముగరెడ్డి, గోవిందరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

రొంపిచెర్ల,డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) మండలంలో హౌసింగ్ స్కీంలో మంజూరైన ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని హౌసింగ్ ఏఈ యోగానంద్ లబ్ధిదారులకు సూచించారు. శనివారం లబ్ధిదారులు చేపట్టిన ఇళ్ల నిర్మాణ తీరును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వంలో 1813ఇళ్లు మంజూరు చేయగా 1154 పూర్తయ్యాయన్నారు. రూ.23.81 కోట్లు లబ్ధిదారులకు చెల్లించామన్నారు. 195 పునాది, 52 గోడలు, 230రూఫ్, 131 నిర్మాణాలు కాంక్రీట్ దశలో ఉన్నాయని వివరించారు.

చెన్నకేశవస్వామికి పూజలు

రొంపిచెర్ల,డిశంబరు 14 (ఆంధ్రజ్యోతి) బొమ్మయ్యగారిపల్లె గ్రామంలోని చెన్నకేశవ స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.


దాడి చేసినవారిని అరెస్ట్‌చేయాలి

పలమనేరు, డిసెంబరు14 (ఆంధ్రజ్యోతి) : మీడియా స్వేచ్ఛను హరించడం దుర్మార్గమని స్థానిక మానవహక్కుల సంఘం అవినీతి నిర్మూలన సంస్థ కన్వీనర్ డీవీ మునిరత్నం పేర్కొన్నారు. శనివారం పలమనేరులో సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కడపజిల్లాలో సాగునీటి సంఘాల ఎన్నికల కవరేజికి కొందరు దాడికి పాల్పడిన సంఘటనను ఖండించారు. దాడికి పాల్పడిన అరెస్టుచేయాలని డిమాండు చేశారు. సరస్వతి, రత్నమ్మ, గంగిరెడ్డి, శ్రీనివాసులు, ఆనంద్, మణి, శంకరప్ప, లక్ష్మప్ప పాల్గొన్నారు.

నేడు కుప్పంలో ఉచిత కంటి పరీక్ష

కుప్పం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): సాయిమాతా సేవాట్రస్టు ఆధ్వర్యంలో, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సహకారంతో, బెంగళూరు శంకర కంటి ఆసుపత్రి ఆదివారం ఉచిత కంటి పరీక్ష శిబిరం నిర్వహించనున్నట్లు ట్రస్టు అధ్యక్షుడు జగదీశ్‌బాబు తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఉదయం 9 గంటలకు జరిగే శిబిరంలో కంటి రోగులను పరీక్షించి, అవసరమైన వారిని ఉచిత కంటి ఆపరేషన్లకు ఎంపిక చేస్తారన్నారు. నియోజకవర్గ ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన ఒక ప్రకటనలో కోరారు.

సాగునీటి సంఘాల సారథులు వీరే



బైరెడ్డిపల్లెలో సాగునీటిసంఘ అధ్యక్షుడు, సభ్యులను సత్కరిస్తున్న టీడీపీ నేతలు

కల్లూరు,డిసెంబరు14(ఆంధ్రజ్యోతి): సాగునీటి వినియోగదారుల సంఘాలకు శనివారం జరిగిన ఎన్నికల్లో టీడీపీ సత్తా చాటుకుంది. ఆ పార్టీ మద్దతుదారులు విజయం సాధించారు. సంఘాలకు అధ్యక్ష కార్యదర్శులుగా ఎన్నికైన వారి వివరాలిలా. **పులిచెర్ల** మండలంలో సురేంద్రనాయుడు, వెంకటేష్(రామసముద్రంచెరువు), అర్జునయ్య, శివకృష్ణప్రసాద్(పేరమడుగుచెరువు), రాధ, రామనాయుడు(దిన్నెపాటిచెరువు), అరుణాచలంనాయుడు, గురుమూరి(కోనేటిచెరువు), రామనాథం, విజయేంద్రనాథరెడ్డి(వెంకటరెడ్డిచెరువు). **సోమల**: వరదం వెంకటరమణ, చిన్నబ్బఎగువదిగువ కాలువ), గల్లా బోసు జ్ఞానశేఖర్, గుత్తా గౌతం(ఇరికిపెంట చెన్నపట్నం), టి. రెడ్డెప్ప, ఏ. రెడ్డెప్ప(వల్లిగట్ల), వరాలరెడ్డి, తిమ్మయ్య(కందూరు ఫారెస్ట్) రమణ, బషీర్(నంజంపేట), టి. వెంకట్రమణ నాయుడు, వెంకటముని(గార్గేయఆనకట్ట), భాస్కర్‌రెడ్డి, శంకర్‌రాజు(మల్లవంక), రెడ్డెప్పరెడ్డి, రవి నాయుడు(బోనమంద). **పలమనేరు** : బి.సత్యమూర్తి, పి.లక్ష్మీపతి(పలమనేరు), సెల్వరాజు, వసంతమ్మ(కొలమాసనపల్లి), జయప్రకాష్, సుబ్రమణ్యం(పెంగరగుంట), కె. చంద్రబాబు, సి.రామక్రిష్ణ(కరిడిమడుగు). **రామకుప్పం**: పద్మనాభరెడ్డి, సిద్దగౌడు(రామకుప్పం పెద్దచెరువు), గంట్లప్పగౌడు, మురుగేష్(ఎస్.గొల్లపల్లె), శ్రీనివాసులురెడ్డి, అయిపన్నగౌడు(విజలాపురం), ప్రమీలగిరిరాజు, కృష్ణప్ప(సింగసముద్రం), శ్రీనివాసులు, కృష్ణప్ప(చాకలకుప్పం), దామోదరం, మునిరత్నం(కెంచనబల్ల), శాంతసుబ్రహ్మణ్యంనాయుడు, మెద్దులవంక జయరాం(ఆవులకుప్పం). **శాంతిపురం**: శేషాద్రి, వెంకటరమణారెడ్డి(కొలమడుగు), ఆనందనాయుడు, సుబ్బమ్మ(ఎంకేపురం), శివకుమార్, మురుగేష్(రాళ్ళబూదుగూరు), సుశీలమ్మ, వెంకటాచలపతి(సోగడబల్ల) **చౌడేపల్లె**: రాజరెడ్డి, మౌనిక(లద్దిగం మహేశ్వరి చెరువు), భాస్కర్‌రెడ్డి, వెంకటరెడ్డి(పుదిపట్ల), కిరణ్‌కుమార్, వెంకటరమణ(కాటిపేరి), చెరువు వీరభద్రయ్య, రామిరెడ్డి(శెట్టిపేట), శ్రీనివాసులు,జయమ్మ (పెద్దకొండామారి), నరసింహరాజు,ధరణి(కొండయ్యగారిపల్లె), శాంతమ్మ, అంజిరెడ్డి(చారాల), సయ్యద్ ఖాన్, మహ్మద్‌గౌస్(దుర్గసముద్రం), ప్రకాష్‌రెడ్డి, మునిరత్నం(చౌడేపల్లె). **రొంపిచెర్ల**: ఎన్.చిన్నగురవయ్య,ఇరగయ్య(కదిరపల్నాయని చెరువు), పి.రామక్రిష్ణయ్య, ఎస్.ఇరగయ్య(గౌవుని చెరువు), వెంకట్రమణనాయుడు, వెంకటరత్నం(వెంకట్రాయని చెరువు), చిన్నప్పరెడ్డి, ఎం.రామయ్య (నాయని చెరువు). **కుప్పం**: పి.హనుమంతు, డి.శివాజీ (సామగుట్టపల్లె). ప్రతాప్ సింహ, కేసీ.సోమశేఖర్(పరమసముద్రం), కె.రవి, సీఎస్.శ్రీనివాసులు(గుల్లేపల్లె), టి.క్రిష్ణప్ప, మునస్వామి(మొట్లచేను), డీఎం.వెంకటాచలం, సౌభాగ్యలక్ష్మీ(దాసేగానూరు), వి.వెంకటేష్, సులోచన(పెద్దబంగారునత్తం), దేవరాజ్, పెరుమాళ్(పెద్దవంక) సుభాష్, సతీశ్‌కుమార్(బ్రహ్మదేవర చేన్లు). **గంగవరం**: బాలక్రిష్ణ, నీలమ్మ(మామడుగు), దేవేంద్రరెడ్డి, రెడ్డెప్పరెడ్డి(దండపల్లి) జయంత్‌కుమార్, చక్రపాణి(గుండుగల్లు), గోపాల్, వసరాయగౌడు(జీడిమాకులపల్లి). **బైరెడ్డిపల్లె**: దామోదర్‌రెడ్డి, రఘువప్ప బైరెడ్డిపల్లె), మంజునాథరెడ్డి, మనోహర్(కడపనత్తం). **పెద్దపంజాణి**: మొగిలిరెడ్డి(రాజుపల్లె), రాజారెడ్డి(నేలపల్లె), నందగోపాల్(శంకర్రాయలపేట), సుబ్రమణ్యం(కరసనపల్లె), నవీన్‌కుమార్(మిట్టపల్లె), నాగమ్మ(చలమంగళం). **వి.కోట**: కేశవులు, షంషాద్‌బేగమ్(వి.కోట కీలపల్లె), సుధాకర్‌రెడ్డి, సురేంద్రగౌడు(బైరుపల్లె), చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి(చింతల ఎల్లాగరం). **పుంగనూరు**: చిన్నరెడ్డెప్ప, పద్మావతమ్మ(పుంగమ్మ చెరువు), చక్రిపాణి, నరేంద్రరెడ్డి(రాయలచెరువు), వెంకటరాజు, శివమ్మ(ఎత్తూరు) షణ్ముగం, గంగులమ్మ(కుమ్మరనత్తం), రెడ్డెప్ప, కృష్ణప్ప(ఏటవాకిలి), రమేష్, కేశవరెడ్డి(ఆరడిగుంట), కెంపమ్మ, వెంకటేశ్(మాగాండ్లపల్లె), నాగరత్నమ్మ, వెంకటస్వామి(నెక్కుంది) చంద్రారెడ్డి, రాజారెడ్డి(చదళ్ల), అనసూయమ్మ, సుబ్రహ్మణ్యంరెడ్డి(మంగళం), చౌడప్ప, నాగరాజ(మేలుందొడ్డి), యల్లప్పనాయుడు, నాగరత్నం(వనమలదిన్నె), ఉమాకాంత్, లింగమ్మ(అగస్త్యేశ్వర).

చిత్తూరు
జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

పారిశ్రామికవేత్తలకు సహకరిస్తాం


జ్యోతి వెలిగిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్‌తో ఎమ్మెల్యే మురళీమోహన్

పూతలపట్టు, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు టీడీపీతో పాటు జిల్లా యంత్రాంగం పూర్తి సహాయ సహకారాలందిస్తుందని ఎమ్మెల్యే మురళీమోహన్ అన్నారు. పూతలపట్టు మండలం వడ్డేపల్లి పంచాయతీ బందార్లపల్లె గ్రామం వద్ద రూ.23 కోట్లతో నిర్మించనున్న సోలార్ ప్రాజెక్టుకు కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే మురళీమోహన్ శనివారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూతలపట్టు నియోజకవర్గంలో పారిశ్రామికవేత్తలు ముందుకువచ్చి పరిశ్రమలు ఏర్పాటు చేసి, నిరుద్యోగ నిర్మూలనకు కృషిచేయాలన్నారు. వ్యవసాయ, ఉద్యానవన రంగాల పైనే ఆధారపడకుండా పారిశ్రామికవేత్తలు పరిశ్రమల స్థాపనకు కూడా కృషిచేయాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పారిశ్రామికాభివృద్ధికి సహకారమందిస్తారన్నారు. పరిశ్రమల అభివృద్ధి ద్వారా పూతలపట్టు నియోజకవర్గం ఆర్థికంగా, సామాజికంగా దృఢంగా ఎదగడమే తన ధ్యేయమన్నారు. తహసీల్దార్ గుర్రప్ప, ఎంపీడీవో నాగరాజు, టీడీపీ నేతలు దొరబాబుచౌదరి, యువరాజు నాయుడు, ప్రతాపనేని చంద్రమౌళి, ఇంద్రసేన నాయుడు, ఎన్‌పీ ధరణి, గంగారపు హరి, చంద్రబాబు, సోలార్ ప్రాజెక్ట్ యజమాని నవీన్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

వంతెన మరమ్మతులకు చర్యలు తీసుకోండి


కుశస్థలినదిపై తెగిన వంతెనను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

నగరి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): నగరి మున్సిపాలిటీ పరిధిలో కీళపట్టు మార్గంలో గల కుశస్థలీనదిపై ఉన్న వంతెన వరదల ఉధృతికి తెగిపోవడంతో ఎమ్మెల్యే భానుప్రకాష్ శనివారం సాయంత్రం పరిశీలించారు. మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి, తహశీల్దారు రవికుమార్, ఎంపీడీవో సతీష్, ఆర్‌అండ్‌బి ఇన్‌చార్జి డీఈఈ దస్తగిరి, కలిసి వంతెనను పరిశీలించిన ఎమ్మెల్యే యుద్ధప్రాతిపదికన తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. శాశ్వత పరిష్కారానికి వీలైనంత త్వరలో ముఖ్యమంత్రితో చర్చించి చర్యలు తీసుకుంటానని చెప్పారు. నగరి పట్టణ టీడీపీ అధ్యక్షుడు రమేష్‌బాబు,నాయకులు కృష్ణారెడ్డి, గుణశేఖర్, జ్యోతినాయుడు, సలీమ్, వరాలుయాదవ్, శ్రీధర్, అశోక్, మీరా తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పులిగుండు గిరిప్రదక్షిణ



పెనుమూరు, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని పులిగుండు శివాలయంలో కార్తీక పౌర్ణమి వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. భక్తులు దీపాలను వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం స్వామివారిని శేష వాహనంపై అలంకరించి కొత్తరోడ్డు, రాజావేణుగోపాలపురం, సీఎస్.అగ్రహారం మీదుగా గిరిప్రదక్షిణలో ఊరేగింపు నిర్వహించారు. వందలాది భక్తులు పాల్గొన్నారు. మధ్యాహ్నం, రాత్రి భక్తులకు అన్నదానం చేశారు. నిర్వాహకులు షణ్ముగరెడ్డి, గోవిందరెడ్డి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా ఉత్తర ఆరాధన

చిత్తూరు కల్చరల్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): గిరింపేట రాఘవేంద్ర స్వామి మఠంలో శనివారం సుగుణేంద్రతీర్థ మూల వర్లకు ఆలయ అర్చక బృందం ఉత్తర ఆరాధన సేవలు వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో నిర్మాల్య విసర్జనం, పాద, కనక, పూజలు, తులసి, అర్చనలతో పాటు పుష్పాలంకారంతో భక్తులకు దర్శనం కల్పించారు.

ప్రశాంతంగా సాగు నీటి సంఘాల ఎన్నికలు

చిత్తూరు రూరల్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): చిత్తూరు రూరల్ మండలంలో శనివారం జరిగిన సాగునీటి సంఘ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. బ్రాహ్మణ చెరువుకు అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా గుణశేఖర్, రాజశేఖర్, అరతల.. సుగుణమ్మ, రవి, కుర్చివేడు.. యోగానంద నాయుడు, ఆనంద్, దిగువమాసాపల్లి.. శ్రీరాముల నాయుడు, నందీశ్వర నాయుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

శ్రీరంగరాజపురం: మండలంలోని పుల్లూరు అధ్యక్షుడిగా .. కటారి రమేష్ నాయుడు, ఎస్‌ఆర్‌పురం రవి నాయుడు, ఆరిమాకులకోన బుల్లెట్ బాబు, రాజపెరుమాళక్క మునెమ్మ, మూలూరు ఉమాపతి రెడ్డి, దేవళం చెరువుకు రామిరెడ్డి ఏకగ్రీవమయ్యారు. కాగా పుల్లూరు పెద్ద చెరువు, ఆరిమాకులకోన చెరువుకు సంబంధించి గందరగోళ పరిస్థితి ఏర్పడింది. కాగా ఆరిమాకులకోన చెరువుకు సంబంధించి పద్మాపురం గ్రామానికి చెందిన వ్యక్తికి ఇష్టానుసారంగా ఎలా పదవి ఇస్తారని మండల టీడీపీ అధ్యక్షుడు గంధమనేని జయశంకర్ నాయుడిని, పార్టీ మాజీ అధ్యక్షుడు రుద్రప్ప నాయుడు వర్గం ప్రశ్నించారు. ఈ క్రమంలో ఇరు వర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం, తోపులాట జరిగింది. మూలూరు చెరువు సంబంధించి ఓట్లు గల్లంతు అయ్యాయని అధికారులతో టీడీపీ నాయకులు వాగ్వాదానికి దిగారు. స్థానిక టీడీపీ నాయకులు జోక్యం చేసుకోవడంతో వివాదం సర్దుమణిగింది.

గుడిపాల: మండలంలోని నారగల్లు.. చిట్టిబాబు, జైల్ సింగ్, పాపసముద్రం.. చిన్నగోవిందమ్మ, తుమ్మల చంద్రశేఖర్ నాయుడు, బొమ్మసముద్రం.. సునీత, బాబు, వసంతాపురం.. ధనుంజయ నాయుడు, నవీన్ కుమార్, నంగమంగళం.. ధనలక్ష్మి, కన్నన్, పానాటూరు.. శకుంతల, మురళీ మోహన్

వెదురుకుప్పం: వెదురుకుప్పం మండల పరిధిలో నాలుగు సాగునీటి సంఘాల చైర్మన్ పదవులు సహా మెంబర్లను టీడీపీ కైవసం చేసుకుంది. కార్వేటినగరం మండల పరిధిలో 11 సాగునీటి సంఘాలను తెలుగుదేశం పార్టీ దక్కించుకుంది.

విజయపురం: మండలంలోని ఆలపాకం.. రవిచంద్రారెడ్డి, మోహన్‌రావు, మాధవరం.. ముద్దుకృష్ణారెడ్డి, ధనపాల్, ఆలపాకండ్రిగ.. ఢిల్లీనాయుడు, లక్ష్మయ్యనాయుడు, బూచివానత్తం.. శ్రీనివాసులునాయుడు, రాజేంద్రన్, కళియంబాకం.. గాలి రమేష్, మల్లీశ్వరి, పన్నూరు.. రఘునాథరెడ్డి, జాన్‌జయసింగ్, కోసలనగరం.. రాఘవయ్య, రాజేంద్రనాయుడు, గురుస్వామి చెరువుకు కృష్ణమనాయుడు, జానకిరామనాయుడు, కేవీపురం.. వేణుగోపాల్‌నాయుడు, సుశీలత, మంగళం.. సుబ్రహ్మణ్యంరెడ్డి, రాజేంద్రరాజు, ఆమగుంట.. ధర్మారెడ్డి, కాంచన, విజయపురం.. ఉషారాణిరాఘవరాజు, సుబ్రహ్మణ్యంరాజు

తవణంపల్లె: మండలంలో ఐదు సంఘాలు ఏకగ్రీవం కాగా ఒక్కటి వాయిదా పడింది. మేడివంక.. శ్రీరామ్, తిరుమలనాయుడు, సరకల్లు.. ప్రభాకర్‌రెడ్డి, పద్మనాభరెడ్డి, కొండ్రాజుకాల్వ.. వేణుగోపాలనాయుడు, గంగాధరనాయుడు, పుణ్యసముద్రం.. చంద్రశేఖర్‌నాయుడు, వేణు, పట్నం.. లవ కుమార్ యాదవ్, బోడయ్య ఎన్నికయ్యారు. తొడతర కుయ్యవంక సంఘానికి సంబంధించి నామినేషన్ వేసిన అభ్యర్థులు సరైన ధృవీకరణ పత్రాలు జతచేయకపోవడంతో నామినేషన్ తిరస్కరించడంతో ఎన్నిక వాయిదా పడింది.




జంబువారిపల్లి వెంకటప్పనాయునిచెరువు అధ్యక్షుడిగా రవీంద్ర నాయుడు, ఓరూరుపేట సాగు నీటి సంఘం అధ్యక్షుడిగా ధృవీకరణ పత్రం అందుకుంటున్న గంధమనేని రాజేష్, ఎస్‌ఆర్‌పురం మండలంలో గొడవ పడుతున్న తెలుగు తమ్ముళ్లు

పెనుమూరు: పెనుమూరు.. చిన్నస్వామి నాయుడు, రమేష్, చింత పెంట.. విశ్వనాథరెడ్డి, అమరనాథరెడ్డి, గుంటిపల్లి.. సుధాకర్‌రెడ్డి, బాబు, పులికల్లు.. సుదర్శన్ నాయుడు, సుబ్రహ్మణ్య రెడ్డి

యాదమరి: మండలంలోని సుంజర్ల.. లక్ష్మీపతి నాయుడు, నాగరాజు, కూటాలవంక.. కుప్పుస్వామి, సాంబశివారెడ్డి, బొదం.. గిరి, ప్రభాకర నాయుడు

నింద్ర: నింద్ర చెరువుకు బలరాం, సరోజమ్మ, కచ్చరవేడు.. కుప్పయ్య, లోకనాధం, చవరంబాకం.. మనోహర్, ప్రకాష్, అరూరు.. ఓబుల్ రాజు, గోవిందరాజు, కొప్పేడు.. రాధాకృష్ణ, దాక్షాయణి, కావనూరు.. మనోహర్‌నాయుడు, మునికృష్ణయ్య, అత్తూరు.. పురుషోత్తం నాయుడు, దేశమ్మ, ఆగరం.. భాను, షణ్ముగం, ఇరుగువాయి.. ధనంజయలు, మీరా, పాదిరి.. బాలాజీ, చిరంజీవులు, ఓరూరుపేట.. రాజేష్, మురళీకృష్ణ, డికేబేడు.. పరంధామయ్య, గోవిందమ్మ, ఎలకాటూరు.. మోహన్‌రెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి, తిప్పాపురం.. రామచంద్రన్, చంద్రశేఖర్, నేట్టేరి.. మునిరత్నం, చంద్రమౌళీ నాయుడు, కీలంబాకం మేళంబాకం.. మోహన్‌రాజు, నాగభూషణరాజు

బంగారుపాళ్యం: జంబువారిపల్లె.. రవీంద్ర నాయుడు, సురేష్‌రెడ్డి, గుంతూరు.. వాసుదేవ నాయుడు, చిట్టిబాబు, మొగిలి.. ధనంజయ నాయుడు, ఢిల్లీనాయుడు, బలిజపల్లి.. కోదండనాయుడు, సదాశివయ్య, బలిజపల్లి.. హేమన్న, వెంకటముని, మహాసముద్రం.. సురేంద్ర రెడ్డి, పులేంద్ర రెడ్డి, తుంబపాళ్యం.. మురళీమోహన్, రాజమాణిక్యం

పూతలపట్టు: పూతలపట్టు.. లక్ష్మీపతి, మురళీధర్, పోలవరం.. జగన్నాథ రెడ్డి, రామలింగారెడ్డి, గొడుగుచింత.. త్యాగరాజరెడ్డి, మునిరెడ్డి, పి.కొత్తకోట.. మునిరత్నం నాయుడు, నరసింహులు నాయుడు, ఆకనంబట్టు.. కమలాకర్ నాయుడు, నిత్యానందం, పాటూరు.. హేమాద్రి నాయుడు, భాస్కర్ మందడి, తేనేపల్లి.. జయరామ్ నాయుడు, సురేంద్ర రెడ్డి, పాలకూరు.. సోమశేఖర్, ఎం.జానకిరామ్, వావిల్‌తోట.. మదన్‌మోహన్ నాయుడు, ఎం.శీను మందడి, పోటుకనుమ.. యువరాజులు నాయుడు, దేవరాజులు నాయుడు

పాలసముద్రం: పాలసముద్రం కోన చెరువు.. గురిలింగం, కృష్ణమరాజు, పాలసముద్రం.. కొత్త చెరువు.. అమృత, నాగభూషణం నాయుడు, పాలసముద్రం పెద్ద చెరువు.. సింగారం, రవినాయుడు, శ్రీకావేరి రాజుపురం పాత చెరువు.. శ్రీనివాసులు, చంద్రమ్మ, శ్రీకావేరి రాజుపురం కొత్తచెరువు.. పొట్టెమ్మ, కేదారినాయుడు, వనదుర్గాపురం పాత చెరువు.. ఎన్. వరదరాజు, రంజిత, వనదుర్గాపురం కొత్త చెరువు.. పి.కుప్పరాజు, జయలక్ష్మి, వెంగ్రాజుకుప్పం.. బలభద్రనాయుడు, బాలమురగన్, నరసింహపురం.. పి.బి.ఎల్.మూర్తి, కె.శంకరయ్య

నగరి: నగరి చెరువు అధ్యక్షుడిగా బీవీ గణేష్, సత్రవాడ.. చిదంబరం, నెత్తంకండ్రిగ.. జయచంద్రనాయుడు, మాంగాడు.. రామ్మూర్తి నాయుడు, దామరపాకం.. కుమారస్వామి నాయుడు, ముడిపల్లి.. రవిచంద్ర నాయుడు, తెరణి.. బాలచంద్ర, గుండ్రాజుకుప్పం.. దేవన్, మేళపట్టు.. నరసింహ మందడి, అయనంబాకం.. రవి నాయుడు

ఐరాల: ఐరాల మండలంలో అమ్మచెరువు.. వాసుదేవరెడ్డి, వీరభద్రయ్య, బీరప్పచెరువు.. సుబ్రహ్మణ్యం, దేవేంద్ర, బొమ్మసముద్రం.. రఘు, జోయతీశ్వర్‌నాయుడు, చెన్నరాయుని చెరువు.. తులసీరామ్‌దాస్, జయరామిరెడ్డి, చిన్నమరెడ్డి చెరువు.. దేవేంద్రరెడ్డి, మునిరత్నమ్మ, చుక్కావారిపల్లె చెరువు.. మునిరత్నంనాయుడు, జయచంద్రనాయుడు, కోనగుంట చెరువు.. లోకనాథరెడ్డి, కృష్ణమూర్తి, కొత్త చెరువు.. కోటేశ్వరరావు, కృష్ణమూర్తి, నేరేడు చెరువు.. గణేష్‌రెడ్డి, రాజారెడ్డి, పల్లెపాటి దిగువ చెంగన్న చెరువు.. చిన్నబ్బనాయుడు, బాబునాయుడు, పిళ్లారి చెరువు.. శైలజ, బాలకృష్ణమందడి, రెడ్డి చెరువు.. చెన్నకేశవరెడ్డి, కిషోర్‌రెడ్డి, వీరరాఘవరెడ్డి చెరువు.. వెంకటేశులు, గురుమూర్తిశెట్టి, వేలురెడ్డి చెరువు.. కృష్ణకుమార్, మోహన్‌నాయుడు

గంగాధరనెల్లూరు: గంగాధరనెల్లూరు మండలం తూగుండ్రం చెరువు.. వెంకటేశులునాయుడు, జ్యోతి శాంతకుమార్, గంగాధరనెల్లూరు.. లోకనాధనాయుడు, రాజేశ్వరి, వరత్తూరు.. షణ్ముగంరెడ్డి, రామచంద్రనాయుడు, వేల్కూరు.. అచ్యుతానందరెడ్డి, నవీన్, అంబోధరపల్లె లక్ష్మీపతినాయుడు, సింగారం, మహదేవమంగళం.. వెంగమనాయుడు, వేణుగోపాల్‌రెడ్డి, ఎల్లాపల్లె.. రవీంద్రనాయుడు, కుమార్, వేపంజేరి.. చిన్నస్వామిరెడ్డి, నాగలక్ష్మి, నెల్లేపల్లె.. సుబ్రమణ్యం, మోహన్, వీరకనెల్లూరు.. విజయన్, సుబ్రమణ్యంశెట్టిలు ఎన్నికయ్యారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి


విజేతలకు అభినందనలు

చిత్తూరు సెంట్రల్, డిసెంబరు 14: విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలని విజయం విద్యాసంస్థల అధినేత తేజోమూర్తి, అకడమిక్ డైరెక్టర్ శైలజామూర్తి అన్నారు. శనివారం స్థానిక విజయం సీబీఎస్ఈ పాఠశాలలో వార్షిక క్రీడోత్సవాలు ఘనంగా నిర్వహించారు. తొలుత మార్చ్‌ఫాస్టుతో గౌరవ వందనం చేశారు. అనంతరం మాక్ డ్రిల్, లెస్యూమ్స్, కరాటే, యోగా తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నిత్యబాబు, బిజినెస్ స్కూల్ ప్రిన్సిపాల్ జయంతీలు వివిధ క్రీడల్లో విజేతలైన వారికి ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కౌసల్య, పీఈటీలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బంగారమ్మ ఊరేగింపు

వెదురుకుప్పం, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం గంగమ్మ జాతరలో భాగంగా శనివారం బంగారమ్మను ప్రత్యేకంగా పూజించి ఊరేగించారు. జాతర చాటింపు జరిగిన తర్వాత తొలిసారిగా అమ్మవారిని ఊరేగించారు.

వైభవంగా కార్తీక దీపోత్సవం

గుడిపాల, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కందగిరికొండలో వెలసివున్న సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో, 197 రామాపురం శివాలయంలో, పాళ్యంకొండ ఆంజనేయస్వామి ఆలయాల్లో పౌర్ణమి సందర్భంగా దీపారాధన చేపట్టారు. ఆలయ చైర్మన్లు సుబ్రహ్మణ్యం నాయుడు, గుర్రప్ప నాయుడు, ఆనంద్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆంజనేయ స్వామి ఆలయ నిర్మాణానికి సహకరిస్తా


మెట్ల పూజ చేస్తున్న చెన్నకేశవులు నాయుడు

గుడిపాల, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రఘునాథపురం గ్రామ సమీపంలో వెలసివున్న పాళ్యంకొండపై అంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి సహకరిస్తానని జేజేఎం ఛారిటబుల్ ఫౌండేషన్ నిర్వాహకులు గురజాల చెన్నకేశవులు నాయుడు అన్నారు. శనివారం పౌర్ణమి సందర్భంగా పాళ్యంకొండలో ఆలయానికి వెళ్లేందుకు మెట్లు నిర్మించే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. తమ ట్రస్టు ద్వారా ఆలయానికి అవసరమైన సౌకర్యాలు కల్పిస్తామని చెప్పారు. కార్యక్రమంలో పాళ్యంకొండ అధ్యక్షుడు గుర్రప్ప నాయుడు, కార్యదర్శి తారకరామ్, కమిటీ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

నేడు రోడ్డు విస్తరణ బాధితుల సమావేశం

చిత్తూరు అర్బన్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): రోడ్డు విస్తరణ బాధితుల సమావేశం ఆదివారం సాయంత్రం 4 గంటలకు సింధు హోటల్‌లో జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ సమావేశానికి హైరోడ్డు, కట్టమంచి, కొంగారెడ్డిపల్లె, గిరింపేట, పలమనేరు రోడ్డు బాధిత యజమానులందరూ హాజరవ్వాలని కోరారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం: డాక్టర్ థామస్


రాష్ట్ర ప్రభుత్వ విప్‌ను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

వెదురుకుప్పం, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి, పరిష్కరించడమే లక్ష్యమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే డాక్టర్ వీఎం థామస్ అన్నారు. శనివారం ఎమ్మెల్యేని కార్వేటినగరం మండలం ఆర్కేవీబీపేటకు చెందిన ఎస్సీ సెల్ మండల ప్రధాన కార్యదర్శి చెంగల్రాయులు, మండల యువత ప్రధానకార్యదర్శి ఢిల్లీబాబురెడ్డి, నాయకులు నాగభూషణంరెడ్డి, సతీష్, ముని కలసి పంచాయతీలో ఉన్న సమస్యలను తెలియజేశారు. సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ క్రమంలో ప్రభుత్వ విప్‌ను టీడీపీ నాయకులు శాలువ కప్పి సత్కరించారు.

హైందవ శంఖారావాన్ని విజయవంతం చేయాలి : బీజేపీ



చిత్తూరు సెంట్రల్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): విజయవాడలో జనవరి 5న నిర్వహించే హైందవ శంఖారావం బహిరంగ సభను విజయవంతం చేయడానికి హిందువులు పెద్ద ఎత్తున తరలిరావాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు పిలుపునిచ్చారు. శనివారం 28వ డివిజన్ పరిధిలోని వినాయకపురంలో బహిరంగ సభ పత్రికను విడుదల చేశారు. స్థానిక ప్రజల్లో చైతన్యం కల్పించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కృపానందం, మాజీ మున్సిపల్ చైర్మన్ భాస్కర్, బీజేపీ నాయకులు కార్తికేయన్, శ్రీనివాసన్ తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి సంఘాల ఎన్నికల్లో రాజకీయ జోక్యం విచారకరం: సీపీఐ


ప్రసంగిస్తున్న రామానాయుడు

నగరి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): సాగునీటి సంఘాలను ఏకగ్రీవం చేసుకోవడంలో మితిమీరిన రాజకీయజోక్యాన్ని సీపీఐ నాయకులు తీవ్రంగా విమర్శించారు. శనివారం నగరి సీపీఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామానాయుడు, జిల్లా ప్రధానకార్యదర్శి నాగరాజు, నగరి నియోజకవర్గ కార్యదర్శి కోదండయ్యలు మాట్లాడుతూ రైతులకోసం సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహించడం అభినందనీయమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అధికారపార్టీ నాయకులు తమ పార్టీ అనుకూలురకు మద్దతుగా నిలిచి ఏకగ్రీవాలు చేయడం విచారకరమన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు పంటలు నష్టపోయిన వారిని ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో వేలన్, బాషా, రాజేంద్ర, శేఖర్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

భక్తి ప్రపత్తులతో ఊర దీపోత్సవం



గిరింపేట చిదంబరేశ్వర ఆలయంలో దీపారాధన చేస్తున్న భక్తులు, అంకాల పరమేశ్వరి ఆలయం మీద వెలుగుతున్న ఊర దీపం

చిత్తూరు కల్చరల్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): నగరంలోని శివ, శక్తి అమ్మవార్ల ఆలయాల్లో శనివారం కార్తీకమాస (తమిళ) ఊర దీపోత్సవాలను భక్తి ప్రపత్తులతో నిర్వహించారు. గిరింపేట శివగామి సుందరి సమేత చిదంబరేశ్వర, గుర్రప్పనాయుడు వీధి అంకాల పరమేశ్వరి అమ్మవారి ఆలయాల్లో భక్తులు దీపారాధనలు చేసి స్వామి అమ్మవార్లను కొలిచారు. ఈ కార్యాక్రమాల్లో పాల్గొన్న భక్తులకు ఆలయాల నిర్వాహకులు అన్నదానం చేసారు.

ఆర్థికాభివృద్ధికి బ్యాంకు రుణాలు తోడ్పడాలి


గూగుల్ మీట్‌లో పాల్గొన్న ఇన్‌చార్జి పీడీ శ్రీదేవి

చిత్తూరు సెంట్రల్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): బ్యాంకు రుణాలు ప్రతి మహిళ ఆర్థికాభివృద్ధికి తోడ్పడాలని సెర్ప్ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. సీఈవో పాండ్యన్, స్త్రీనిధి ఎండీ శ్రీహరి ప్రసాద్‌లతో కలిసి ఆయన శనివారం విజయవాడ నుంచి స్త్రీనిధి క్రెడిట్ కోపరేటివ్ ఫెడరేషన్ లిమిటెడ్ రాష్ట్ర స్థాయి 18వ జనరల్ బాడీ సమావేశం గూగుల్ మీట్ ద్వారా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రతి లోను ఆదాయ, అభివృద్ధి కార్యక్రమాలకు ఉపయోగపడాలని, క్షేత్రస్థాయిలో నిధులు దుర్వినియోగం కాకుండా చూడాలన్నారు. రుణాల రికవరీతో పాటు సిబిల్ స్కోర్ సైతం పెంచాలన్నారు. సీఈవో మాట్లాడుతూ డిజిటల్ పేమెంట్ విధానం చేయడంతో పాటు తరచూ సమావేశాలు నిర్వహించి, లోపాలు సవరించాలని సూచించారు. జిల్లా నుంచి డీఆర్‌డీఏ ఇన్‌చార్జి పీడీ శ్రీదేవి, స్త్రీనిధి ఏజీఎం వెంకటప్రసాద్, డీపీఎం రవికుమార్, జిల్లా సమాఖ్య మండల అధ్యక్షులు పాల్గొన్నారు.

జీవో 117 రద్దు చేయాలి: ఆపస్


మంత్రి లోకేష్‌కు వినతిపత్రం అందజేస్తున్న బాలాజి

చిత్తూరు సెంట్రల్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): విద్యాశాఖ అస్తవ్యస్తం కావడంలో భూమిక పోషించిన జీవో 117ను రద్దుచేసి ప్రభుత్వ విద్యా విధానాన్ని బలోపేతం చేయాలని ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ విద్యాశాఖ మంత్రి లోకేష్‌కు విజ్ఞప్తి చేసి, వినతి పత్రం అందజేశారు. శనివారం విజయవాడలో గుర్తింపు పొందిన ఉపాధ్యాయుల సంఘాల సమన్వయ సమావేశం జరిగింది. అనంతరం మంత్రిని కలిసిన ఆపస్ నాయకులు జీవో 117 రద్దుతో పాటు 80 మంది విద్యార్థులు దాటిన ప్రైమరీ స్కూల్స్‌కు హెచ్‌ఎం పోస్టు ఇవ్వాలన్నారు. మండలాల్లో పీఆర్ జూనియర్ కళాశాలలు ఏర్పాటు చేయడంతో పాటు హైస్కూల్ ప్లస్‌లు కొనసాగించాలన్నారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

లోక్‌అదాలత్‌లో 188 కేసులు పరిష్కారం


నగరి కోర్టులో లోక్‌అదాలత్ నిర్వహిస్తున్న దృశ్యం

నగరి, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): నగరి జూనియర్ సివిల్ మేజిస్ట్రేట్ కోర్టులో శనివారం జరిగిన జాతీయ లోక్‌అదాలత్‌లో 188 కేసులను న్యాయమూర్తి విష్ణువర్ధ పరిష్కరించారు. సివిల్ -8, క్రిమినల్ -11, ఎక్సైజ్ -17, సీసీ -3, క్రైమ్‌స్టేజ్-4, సెకండ్‌క్లాస్-135, పీఎల్‌సీ-10 కేసులను పరిష్కరించినట్లు చెప్పారు. ఇందుకు సంబంధించి రూ.18,78,550 రికవరీ చేసినట్లు కోర్టు సిబ్బంది తెలియజేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు, పోలీసులు, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

సంగం డెయిరీ చైర్మన్ జన్మదిన వేడుకలు


కేక్ కట్ చేస్తున్న గంధమనేని

శ్రీరంగరాజపురం, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఎస్‌ఆర్‌పురం మండలం క్షీరసముద్రం సంగం డెయిరీలో శనివారం సంగం డెయిరీ చైర్మన్, టీడీపీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ జన్మదిన వేడుకలను ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు గంధమనేని రాజశేఖర్ నాయుడు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మన ప్రాంతంలోని నాలుగు మండలాల పాడి రైతుల జీవన ప్రమాణాల పెంపుదలకు సంగం డెయిరీ దోహదపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో సంగం డెయిరీ రీజనల్ మేనేజర్ డాక్టర్ వై.పి.వెంకటేశ్వర్లు, జోనల్ మేనేజర్ వడ్లమూడి వెంకటరమణ నాయుడు, డెయిరీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వేణుగోపాలుడికి క్షీరాభిషేకం

వెదురుకుప్పం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవరగుడిపల్లె - ఆడారెడ్డిపల్లె సమీపంలో ఉన్న వన వేణుగోపాల స్వామికి శనివారం క్షీరాభిషేకం కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రధాన అర్చకులు కె.కార్తీక్ అయ్యంగార్ స్వామికి క్షీరాభిషేకం, అర్చన, ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాదం అందజేశారు.